పెద్ద రోగమొస్తే.. పట్నానికే..



2డీ ఈకో పరీక్ష చేస్తున్న గుండె వైద్య నిపుణుడు(ఫైల్)

- మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రిలో లభించని గుండె, నరాలు, మూత్రపిండాల వ్యాధులకు చికిత్స
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేదలు
- గతంలో మాజీ సూపరింటెండెంట్ సహకారంతో వారం వారం క్లినిక్ నిర్వహణ
- కరోనా కారణంగా మూత.. మళ్లీ తెరిపించాలని విన్నపాలు



మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రి

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం) ఫిబ్రవరి 15: తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత మహబూబ్‌నగర్‌కు మొట్టమొదటి వైద్య కళాశాల మంజూరైనా.. అందులో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను మాత్రం చేర్చ లేదు. ఏదైనా అంటే.. జిల్లాకు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వచ్చిందని, అది పూర్తయితే అన్ని విభాగాలు ఉంటాయని అధికారులు, ప్రజా ప్రతినిధులు నెట్టుకొస్తున్నారు. కానీ అది పూర్తయ్యే వరకు ఏదైనా పెద్ద రోగమొస్తే పట్నమైనా పోవాలి.. లేదంటే ప్రైవేటుకైనా పోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇంతపెద్ద ఆస్పత్రిలో గుండె, నరాలు, మూత్రపిండాల వ్యాధుల విభాగాలు లేకపోవడంతో పేద ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అయితే ఈ విభాగాలకు సంబంధించి గతంలో అప్పటి సూపరింటెండెంట్ డాక్టర్ రాంకిషన్ సహకారంతో ప్రైవేటు డాక్టర్లతో మాట్లాడి వారం వారం క్లినిక్‌ను జనరల్ ఆస్పత్రిలో ఏర్పాటు చేయించారు. కరోనా రాకతో అది మూతపడింది. మళ్లీ గుండె వైద్యసేవల క్లినిక్‌ను ఏర్పాటు చేసినా అది కూడా ఇటీవల బంద్ అయ్యింది. దాంతో ఆయా చికిత్సల కోసం వస్తున్న రోగులు పాట్లు పడుతున్నారు.

సూపర్‌స్పెషాలిటీ విభాగాలు లేవు

ప్రభుత్వ వైద్య కళాశాల మంజూరైన తర్వాత మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రి జనరల్ ఆస్పత్రిగా మారిపోయింది. స్పెషాలిటీ సేవలన్నీ అందుబాటులోకి వచ్చాయి. కానీ.. సూపర్‌స్పెషాలిటీ వైద్య సేవలైన గుండె, నరాలు, మూత్రపిండాల వ్యాధుల చికిత్స విభాగాలు మాత్రం వైద్య కళాశాలకు మంజూరు కాలేదు. ఇప్పటి వరకు రెండు బ్యాచ్‌ల వైద్య విద్యార్థులు బయటకు వచ్చారు. అయినా ఆ పోస్టులు మంజూరు చేయలేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు సైతం దాని ఊసు ఎత్తడం లేదు. అయితే గత ఏడాది జిల్లాకు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి మంజూరైంది. అది నిర్మాణ దశలో ఉంది. పూర్తయ్యేందుకు మరో రెండేళ్లు పట్టొచ్చు. అప్పటి వరకు సూపర్ స్పెషాలిటీ సేవల కోసం ఎక్కడికి వెళ్లాలని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ప్రైవేటు డాక్టర్ల సహకారంతో క్లినిక్ ఏర్పాటు

ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సూపర్ స్పెషాలిటీ సేవలు అందించాలనే ఉద్దేశంతో ఆస్పత్రి అప్పటి సూపరింటెండెంట్ డాక్టర్ రాంకిషన్ ప్రైవేటు డాక్టర్ల సహకారంతో 2018లో వారం వారం క్లినిక్‌ను ఏర్పాటు చేశారు. ఈ మేరకు గుండె వ్యాధులకు సంబంధించి హైదరాబాద్‌లోని ఇండో యూఎస్ ఆస్పత్రి వైద్య బృందం, యూరాలజీకి సంబంధించి జిల్లా కేంద్రంలోని డాక్టర్ రాజేశ్‌గౌడ్, నరాలకు సంబంధించి డాక్టర్ సందీప్ సహకారంతో వారంలో ప్రతీ బుధ, గురు, శుక్రవారాల్లో ఈ మూడు విభాగాల క్లినిక్‌ను ఏర్పాటు చేశారు. ప్రతీ వారం ఒక్కో విభాగంలో దాదాపు 100 నుంచి 150 రోగులను పరీక్షించేవారు. గుండెకు సంబంధించిన 2 డీఈకో కూడా అక్కడే చేసేవారు. అంతేకాకుండా ఎవరికైనా ఆపరేషన్ చేయాల్సి వస్తే ఆరోగ్యశ్రీ పథకం కింద వారి ఆస్పత్రికి తీసుకెళ్లి చేసేవారు. కానీ కరోనా కారణంగా ఆ క్లినిక్‌లు మూతపడ్డాయి. ఆ తర్వాత 2023 జూలైలో అపోలో స్పెక్ట్రా ఆస్పత్రి ఆధ్వర్యంలో మళ్లీ గుండె వైద్య సేవల క్లినిక్‌ను ఏర్పాటు చేయించారు. కొన్నాళ్లు బాగానే కొనసాగినా మళ్లీ డిసెంబర్‌లో ఆగిపోయింది.

ప్రైవేటుకు వెళ్లాల్సిందే..

ప్రస్తుతం జనరల్ ఆస్పత్రిలో కార్డియాలజీ, యూరాలజీ, న్యూరాలజీ విభాగాల చికిత్స లేకపోవడంతో రోగులు ప్రైవేటుకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ మూడు విభాగాల రోగాలు వస్తే జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆస్పత్రులకు లేదంటే హైదరాబాద్‌కు వెళ్లాలి. ప్రైవేటులో కేవలం ఓపీ ఫీజు రూ.300 నుంచి రూ.500 చెల్లించాల్సి వస్తోంది. ఆపరేషన్లు చేసుకోవాలంటే లక్షల రూపాయలు ఖర్చవుతున్నాయి. ఈ మూడు విభాగాలు ప్రధానమైనవి కావడంతో రోజుకు వందల సంఖ్యలో ఓపీ వస్తున్నప్పటికీ ప్రైవేటుకు వెళ్లాలని సూచిస్తున్నారు. కనీసం ఓపీ చూపించుకోవడానికైనా మళ్లీ ఈ క్లినిక్‌లను తెరిపిస్తే కొంత మేలు జరుగుతుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

ప్రత్యామ్నాయంగా సేవలు అందిస్తున్నాం

జనరల్ ఆస్పత్రిలో గుండె, మూత్రపిండాలు, నరాలకు సంబంధించిన పోస్టులు లేవు. దీంతో జనరల్ మెడిసిన్ విభాగంలో ఓ గుండె వైద్యుడిని నియమించుకున్నాం. అడ్మిట్ అయిన కేసులకు ఆయనతో 2డీ ఈకో చేయిస్తున్నాం. సర్జరీలకు సంబంధించి కూడా ఆయనతోనే ఫిట్‌నెస్ ఇప్పిస్తున్నాం. ఓపీకి ఆ మూడు విభాగాల డాక్టర్లు లేరు. ప్రత్యమ్నాయంగా.. గుండె, న్యూరాలజీకి సంబంధించి జనరల్ మెడిసిన్ డాక్టర్లతో, యూరాలజీకి సంబంధించి సర్జరీ డాక్టర్లతో సేవలందిస్తున్నాం. ఏదైనా పెద్ద సమస్య ఉంటే హైదరాబాద్ ఉస్మానియా, గాంధీ ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నాం. ప్రైవేటు డాక్టర్ల సహకారంతో మళ్లీ క్లినిక్‌లను ఏర్పాటు చేసే ప్రక్రియపై ఆలోచిస్తాం.

- డాక్టర్ జీవన్, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్



గుండె వైద్యసేవల విభాగంలో రోగుల రద్దీ(ఫైల్)



ఇంటర్ ద్వితీయ సంవత్సరం ప్రాక్టికల్ పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఐఈవో శ్రీధర్

నేడు ఇంగ్లీష్ ప్రాక్టికల్ పరీక్ష

- ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు నిర్వహణ
- ఈ ఏడాది నుంచే ప్రారంభం
- ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ముగింపు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం ఫిబ్రవరి 15: నేడు ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లీష్ ప్రాక్టికల్ పరీక్ష నిర్వహించనున్నారు. ఇప్పటి వరకు ఇంటర్ సైన్స్ ద్వితీయ, ఒకేషనల్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మాత్రమే ప్రాక్టికల్ పరీక్షలు ఉండేవి. కానీ ఈ ఏడాది నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్ష పెట్టనున్నారు. అన్ని గ్రూప్‌ల విద్యార్థులు ఈ పరీక్షకు హాజరు కావాల్సి ఉంటుంది. విద్యార్థుల్లో ఆంగ్ల నైపుణ్యం, వ్యక్తిత్వ వికాసం పెంపొందించేందుకు ప్రభుత్వం ఈ పరీక్ష నిర్వహిస్తోంది. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేసినట్లు డీఐఈవో డాక్టర్ శ్రీధర్ సుమన్ తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం విద్యారులకు మాత్రమే ఈ పరీక్ష ఉంటుంది. వచ్చే ఏడాది నుంచి ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు కూడా ప్రాక్టికల్ పరీక్ష ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటి వరకు ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లీష్ పరీక్షను 100 మార్కులకు నిర్వహించేవారు. ఈ ఏడాది నుంచి మొదటి ఏడాది విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షకు 20 మార్కులు, థియరీకి 80 మార్కులు కేటాయించనున్నారు. ప్రాక్టికల్ పరీక్షలో 20 మార్కులకుగాను తప్పనిసరిగా ఏడు మార్కులు వస్తేనే పాస్ అయినట్లు. థియరీ పరీక్షలో 80కి గాను 28 మార్కులు రావాలి. రెండు కలిపితే 35 మార్కులు తప్పనిసరిగా ఉండాలి. ఏ ఒక్కదాంట్లో తక్కువ వచ్చినా ఫెయిల్ అయినట్లే పరిగణిస్తారు. ప్రాక్టికల్ పరీక్షకు హాజరు కాకున్నా అందులో ఫెయిల్ అయినట్లే.

పాక్టికల్ పరీక్షలకు మార్కులు ఇలా..

ఇంగ్లీష్ ప్రాక్టికల్ పరీక్షలల్లో కమ్యూనికేషన్ ఫంక్షన్స్‌కు నాలుగు మార్కులు, జస్ట్ ఏ మినిట్‌కు నాలుగు మార్కులు, రోల్‌ప్లేకు నాలుగు మార్కులు, లిజనింగ్, కాంప్రిహెన్షన్‌కు నాలుగు మార్కులు, రికార్డులకు నాలుగు మార్కులు ఉంటాయి. బోర్డు ప్రకటించిన విధంగా ఈ నెల 16న పరీక్ష నిర్వహిస్తారు. ఇందుకు సంబంధించి ఒక్క బ్యాచ్‌కు 50 మంది విద్యార్థుల చొప్పున విభజిస్తారు. పరీక్ష సమయం గంట ఉంటుంది. ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు మొదటి బ్యాచ్, ఆ తర్వాత మధ్యాహ్నం రెండు గంటల నుంచి గంట పాటు రెండో బ్యాచ్‌కు పరీక్ష ఉంటుంది. ఈ పరీక్షను సంబంధిత కళాశాల అధ్యాపకులే నిర్వహిస్తారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో మొదటి ఏడాది విద్యార్థులు మొత్తం 35 వేల మంది పరీక్షకు హాజరుకానున్నారు.

ద్వితీయ విద్యార్థులకు ముగిసిన ప్రాక్టికల్స్

పదిహేను రోజులుగా ఇంటర్ ద్వితీయ సంవత్సరం, ఒకేషనల్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన ప్రాక్టికల్ పరీక్షలు గురువారంతో ముగిశాయి. పాలమూరు జిల్లా వ్యాప్తంగా జనరల్(సైన్స్) ప్రాక్టికల్స్‌కు 648 మంది విద్యార్థులకు గాను 631 మంది విద్యార్థులు హాజరయ్యారు. 17 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 1,139 మందికిగాను 1,036 మంది హాజరుకాగా, 103 మంది పరీక్ష రాయలేదు. మధ్యాహ్నం జరిగిన జనరల్ ప్రాక్టికల్స్‌కు 541 మంది విద్యార్థులకుగాను 528 మంది హాజరు కాగా, 13 మంది, ఒకేషనల్‌కు 1,097 మందికి గాను 1,054 మంది హాజరు కాగా.. 43 మంది హాజరు కాలేదు. పరీక్ష కేంద్రాలను డీఐఈవో డాక్టర్ శ్రీధర్‌సుమన్ పర్యవేక్షించారు. జిల్లా వ్యాప్తంగా పాక్టికల్స్ ప్రశాంతంగా ముగిశాయని ఆయన చెప్పారు.

రామరాజ్యం రావాలి

- బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ
- అయోధ్యకు బయల్దేరిన రైలుకు జెండా ఊపి ప్రారంభం



రామ భక్తులతో అయోధ్యకు బయల్దేరిన ప్రత్యేక రైలును జెండా ఊపి ప్రారంభిస్తున్న బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ

మహబూబ్‌నగర్ (క్లాక్‌టవర్), ఫిబ్రవరి 15: భారత దేశంలో రామరాజ్య స్థాపన జరగాలని భారతీయ జనతా పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్(మహబూబ్‌నగర్ రైల్వే స్టేషన్) నుంచి అయోధ్యకు వెళ్లేందుకు రామ భక్తుల కోసం ఏర్పాటు చేసిన మొదటి రైలును గురువారం ఆమె జెండా ఊపి, ప్రారంభించారు. అంతకు ముందు రామ భక్తులు తాళమేళాలతో భజన చేస్తూ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆమె భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. భారత దేశంలో రామరాజ్య స్థాపన జరగాలని ఉద్ఘాటించారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్‌లోని అన్ని నియోజకవర్గాల నుంచి నియోజకవర్గానికి 200 మంది చొప్పున రామ భక్తులు అయోధ్యలో కొలువైన బాలరాముని దర్శనం కోసం బయలుదేరారని, వారి యాత్ర సుఖవంతంగా జరగాలని కోరారు. టికెట్ తీసుకున్న ప్రతీ భక్తుడికి శ్రీరామ జన్మ భూమి ట్రస్ట్ కమిటీ సభ్యులు భోజన సదుపాయంతో పాటు వసతిని ఏర్పాటు చేశారన్నారు. నియోజకవర్గం వారీగా, అలాగే ప్రతీ కంపార్ట్‌మెంట్‌కు ఒకరి చొప్పున ఇన్‌చార్జీలను నియమించారన్నారు. అయోధ్యలో చలి ఎక్కువగా ఉన్నందున 50 ఏళ్లలోపు భక్తులు మాత్రమే వెళ్లాలని, ఆపై వయసున్న వారు వెళ్లొద్దన్నారు. మరికొన్ని రోజుల తర్వాత రామ భక్తుల కోసం మరో ప్రత్యేక రైలు నడిపేందుకు కేంద్ర ప్రభుత్వాన్ని కోరనున్నట్లు తెలిపారు. ఒకరి తర్వాత ఒకరం అందరం బాలరాముని దర్శనానికి వెళ్దామని పిలుపునిచ్చారు. అయోధ్యలో రామమందిర నిర్మాణం ప్రతీ హిందువు ఆకాంక్ష అని, అది నరేంద్ర మోదీ వల్ల తీరిందని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు ఏపీ జితేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారి శాంతకుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పద్మజారెడ్డి, బాల త్రిపుర సుందరి, రాష్ట్ర నాయకులు ఏపీ మిథున్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్ రెడ్డి, యువమోర్చా జిల్లా అధ్యక్షుడు కిరణ్ కుమార్ రెడ్డి, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సాహితీ రెడ్డి పాల్గొన్నారు.

చిరుత దాడిలో జింక మృతి



చిరుత దాడిలో మృతి చెందిన జింక

ఖిల్లాఘణపురం, ఫిబ్రవరి 15: మండలంలోని పర్వతాపూర్ గ్రామ ఆంజనేయ స్వామి దేవాలయం సమీపంలో రెండు రోజుల క్రితం చిరుత దాడిలో జింక మృతి చెందింది. దుర్వాసన రావడంతో రైతు బెస్తగాండ్ల గోపాల్ వెళ్లి చూసి, గ్రామస్థులకు తెలిపాడు. గ్రామస్థులు వెళ్లి చూశారు. చిరుత జింక తల భాగం మొత్తం తినేసిందని గుర్తించారు. చిరుత మూడు నెలలుగా వరుసగా జీవాలపై దాడి చేస్తున్నా అటవీశాఖ అధికారులు పూర్తి స్థాయిలో గాలింపు చర్యలు చేపట్టడం లేదని మండల ప్రజలు వాపోతున్నారు. ఈ విషయంపై అటవీశాఖ ఘణపురం రేంజర్ అధికారి మంజులను వివరణ కోరగా.. జింకను అడవి జంతువు చంపి తిన్నదని, అడవి మృగాలు జంతువులను తినడం సహజమని తెలిపారు. చిరుతను బంధించడానికి గతంలో ఎర్రగుంట్ల వద్ద బోనును ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు ఆ ప్రాంతంలో తిరగడంతో చిరుత మరోవైపు వెళ్లిందన్నారు.

సిట్టింగ్.. మంచింగ్..

- జోగుళాంబ గద్వాల జిల్లాలో నిబంధనల ఉల్లంఘన
- వైన్ షాపుల వద్దే ఆహార పదార్థాల విక్రయం
- అధికారులకు ప్రతీ నెల మామూళ్లు?
- కొత్త అధికారులకు సమస్యల స్వాగతం



ఓ పర్మిట్ రూమ్‌లో మద్యం తాగుతున్న మందు ప్రియులు(ఫైల్)

గద్వాల క్రైం, ఫిబ్రవరి 15: జోగుళాంబ గద్వాల జిల్లాలో బార్ల పర్మిట్ రూమ్‌లు బార్ అండ్ రెస్టారెంట్లను తలపిస్తున్నాయి. వైన్ షాప్‌ల నిబంధనలకు విరుద్ధంగా సిట్టింగ్‌లు ఏర్పాటు చేసి, మంచింగ్ కోసం చికెన్, ఫిష్ రోస్ట్, బోటీతో పాటు ఇతర నాన్‌వెజ్ పదార్థాలను సరఫరా చేస్తున్నారు. దాంతో మద్యం ప్రియులు ఫుల్‌గా తాగుతున్నారు. వారి కారణంగా జోగుళాంబ గద్వాల జిల్లాలో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. జిల్లాలో 36 మద్యం దుకాణాలు ఉండగా, గద్వాల స్టేషన్ పరిధిలో 21, అలంపూర్ స్టేషన్ పరిదిలో 15 దుకాణాలు ఉన్నాయి. మద్యం దుకాణాల పక్కన 20 నుంచి 100 చదరపు మీటర్లలో పర్మిట్ రూమ్ ఉండాలి. వాటిలో సిట్టింగ్ సౌకర్యం ఉండకూడదు. నిల్చొని మాత్రమే మందు తాగి వెళ్లాల్సి ఉంటుంది. అప్పుడు అక్కడ వారు ఐదు నుండి 10 నిమిషాలకంటే ఎక్కువ ఉండరు. కానీ యథేచ్ఛగా సిట్టింగ్‌లు, కొన్ని చోట్ల కింద కూర్చొని తాగడానికి ఏర్పాట్లు చేయడంతో గంటల తరబడి గడుపుతూ, క్వార్టర్ తాగాల్సిన వ్యక్తి ఫుల్లుగా తాగుతున్నారు. గద్వాల జిల్లా కేంద్రంలోని పాతబస్టాండ్ సమీపంలో గల వైన్స్ పక్కన ఉన్న పర్మిట్ రూంలో కూర్చొని మద్యం తాగుతున్నారు. జమ్ములమ్మ దేవాలయం సమీపంలోని వైన్ షాప్ వెనుక ఏర్పాటు చేసిన పర్మిట్ రూమ్ చిన్న రెస్టారెంట్‌ను తలపిస్తోంది. పర్మిట్ రూంలలో ఎలాంటి ఆహార పదార్థాలు విక్రయించొద్దు. కానీ గద్వాల పట్టణంతో పాటు జిల్లాలోని అన్ని పర్మిట్ రూంలలో చికెన్, మటన్, ఫిష్ కర్రీ, రోస్ట్‌లతో పాటు బోటీ కూడా విక్రయిస్తున్నారు. దాంతో మద్యం ప్రియులు గంటల తరబడి కూర్చొని మద్యం తాగుతున్నారు.

మామూళ్ల మత్తులో అధికారులు

దుకాణాల యజమానులు ఇచ్చే మామూళ్లకు ఆశపడి అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. జిల్లాలోని ప్రతీ మద్యం దుకాణం నుంచి ఒకరు నెల నెలా రూ.16,000 చొప్పున వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీరితో పాటు మరికొంత మంది అధికారులకు కూడా ప్రత్యేకంగా ముడుపులు ఇవ్వాల్సిందేనని తెలుస్తోంది. సివిల్ పోలీసులు కూడా దుకాణాల నుంచి నెలనెలా సుంకం వసూలు చేస్తున్నట్లు దుకాణాల యజమానులు చెప్తున్నారు. ఇక్కడ కొందరు అధికారులు సంవత్సరాల తరబడి బదిలీ కాకపోవడం, ఉన్నతాధికారులు మొత్తం ఇన్‌చార్జీలు కావడంతో అక్రమాలకు అడ్డుకట్ట వేయడంలో విఫలం అవుతున్నారు. ఇప్పుడు కొత్తగా వచ్చే ఎక్సైజ్, పోలీస్ అధికారులు ఈ సమస్యలు ఎలా పరిష్కరిస్తారో చూడాలి.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగే వారిపై నిఘా ముమ్మరం చేశాం. అలాంటి వారిపై కేసులు నమోదు చేస్తాం. మద్యం దుకాణాల పక్కన పర్మిట్ రూమ్‌లు నిబంధనల ప్రకారం నిర్వహించాలి. తినుబండారాలు విక్రయించొద్దు. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవు. నకిలీ మద్యంపై నిఘా ముమ్మరం చేశాం. ఇప్పటికే పలువురిపై కేసులు నమోదు చేశాం.

- రితిరాజ్, జిల్లా ఎస్పీ

భార్యను నరికి చంపిన భర్త

- నాగర్‌కర్నూలులో ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన



ఇందిరమ్మ (ఫైల్)

నాగర్‌కర్నూల్ క్రైం, ఫిబ్రవరి 15: భార్యను భర్త గొడ్డలితో నరికి చంపిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో గురువారం వెలుగు చూసింది. సీఐ కనకయ్య తెలిపిన వివరాల ప్రకారం... నాగర్‌కర్నూలు జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డులోని బీసీ కాలనీలో నివాసం ఉంటున్న ఎరువ శ్రీనివాసులు, ఇందిరమ్మ(52)లకు ఒక కూతురు ఉన్నది. గత సంవత్సరం కూతురు అఖిల కు వివాహం చేయడంతో ఆమె హైదరాబాద్‌లో ఉంటోంది. తన బంగారు నగలు దాదాపు ఒక తులం తన తల్లి దగ్గర ఉంచింది. ఇదిలా ఉండగా కూతురు వివాహానికి సంబంధించిన కల్యాణలక్ష్మి డబ్బులు తండ్రి స్వాహా చేశాడు. కూతురు ఇంట్లో పెట్టిన బంగారు వస్తువులు కూడా తాకట్టు పెట్టి మద్యానికి ఖర్చు చేశాడు. కూతురి డబ్బులు, బంగారం నువ్వు ఎలా ఖర్చు పెట్టుకుంటావని భార్య ఈ నెల 10వ తేదీన అతడిని నిలదీసింది. ఆవేశానికి గురైన శ్రీనివాసులు అదే రాత్రి గొడ్డలితో భార్యను బెడ్రూంలో నరికి ఇంటికి తాళం వేసి పరారయ్యాడు. తల్లిదండ్రుల మధ్య ఘర్షణ కంటే ముందు రోజు కూతురు అఖిల తల్లితో మాట్లాడింది. ఆ తర్వాత 12వ తేదీన తల్లికి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ అని రావడంతో తండ్రికి ఫోన్ చేసింది. అయన తానే వస్తున్నానంటూ కూతురి దగ్గరకు వెళ్లాడు. తల్లి గురించి తండ్రిని ప్రశ్నించడంతో ఇంటి దగ్గర ఉన్నదని 14వ తేదీ రాత్రి తిరిగి ఇంటికి ఇద్దరూ కలిసి వచ్చారు. ఇంటి సమీపానికి రాగానే ఇంటి తాళం చేతులు కూతురు ముందు పడేసి తండ్రి శ్రీనివాసులు పరారయ్యాడు. కూతురు ఇంటి తలుపులు తీసి చూడగా తల్లి ఇందిరమ్మ మృతి చెంది పడిఉన్నది. బోరున విలపించగా చుట్టుపక్కల వారు వచ్చి చూశారు. దీంతో కూతురు అఖిల తన తల్లిని తన తండ్రే హత్య చేశాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పజెప్పారు. ఈ సంఘటనపై స్థానిక ఎస్ఐ గోవర్ధన్ కేసు నమోదు చేశారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

గట్టు, ఫిబ్రవరి 15 : విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతి చెందాడు. జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండల పరిధిలోని తుమ్మలచెరువు గ్రామంలో గురువారం ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఎనుమల మల్లికార్జున్ (26) బుధవారం రాత్రి 10 గంటల సమయంలో పొలానికి వెళ్లాడు. గురువారం ఉదయం వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు పొలానికి వెళ్లి వెతికారు. అక్కడి ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ తీగ వద్ద బోర్లపడి మృతి చెంది ఉన్నాడు. అయితే తన కుమారుడి మృతిపై అనుమానాలున్నాయని, విచారణ చేపట్టాలని తల్లి సువర్ణమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



బెల్ట్ షాపులో మద్యం పట్టివేత

రాజాపూర్, ఫిబ్రవరి 15 : మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలంలోని ముదిరెడ్డిపల్లి గ్రామంలో బెల్ట్ షాపులపై గురువారం పోలీసులు దాడులు చేశారు. గ్రామంలోని ఓ కిరాణ దుకాణంలో పది క్వార్టర్ బాటిళ్లు, మరికొన్ని చిన్న బాటిళ్లు స్వాధీనం చేసుకొని, ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రవి తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దాడులు నిర్వహించినట్లు ఆయన చెప్పారు.







రూ.3,937 కోట్లు మంజూరు చేయండి

అసెంబ్లీలో జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి



జడ్చర్ల, ఫిబ్రవరి 15 : పాలమూరు ఎత్తిపోతల పథకంలో నిర్మిస్తున్న ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్మాణం కోసం రూ.3937 కోట్ల రూపాయలను మంజూరు చేయాలని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి కోరారు. భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేయాలని కోరుకుంటున్నానంటూ గురువారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఆయన ఉదండాపూర్ రిజర్వాయర్ అంశాన్ని ప్రస్తావించారు. ఈ సందర్భంగా అసెంబ్లీ స్పీకర్‌కు పలు అంశాలను వివరించారు. పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో 2013లో సర్వే చేయడం జరిగిందని తెలిపారు. ఆ తర్వాత 2015లో ప్రాజెక్టు నిర్మాణానికి రూ.35 వేల 200 కోట్లు మంజూరీ చేశారని, 2016లో పేపరు నోటిఫికేషన్ జారీ చేశారని వివరించారు. ప్రాజెక్ట్‌తో 12 లక్షల 30 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు డిజైన్ చేశారన్నారు. ఉదండాపూర్ రిజర్వాయర్ భూనిర్వాసితులకు ఇప్పటి వరకు పునరావాసం కల్పించలేదన్నారు. 2022లో అవార్డు పాస్ అయినా ఇప్పటికీ ప్లాట్లు ఇవ్వలేదు, ఒక్క రూపాయి అందలేదని తెలిపారు. రిజర్వాయర్‌లో భూములు కోల్పోయిన పోలేపల్లి పరిధిలోని భూములకు ఎకరాకు రూ.12 లక్షల పరిహారం అందించారని, ఉదండాపూర్, వల్లూరు నిర్వాసితులకు ఎకరాకు రూ.6 లక్షల 50 వేలు, రూ.5 లక్షల 50 వేలు పరిహారం అందించారని వివరించారు. మల్లన్నసాగర్‌లో భూములు కోల్పోయిన రైతులకు రూ.15లక్షల పరిహారం ఇచ్చారని, ఈ అంశంలో ఉదండాపూర్ రైతులు మోసపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ముంపు గ్రామాల నిర్వాసితులకు పునరావాసం కింద ఉమ్మడి కుటుంబానికి రూ.25 లక్షలు, ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టు రెండు టీఎంసీలు ఉంటే, అదనంగా ఒక టీఎంసీ పెంచి రూ.30వేల కోట్లు వెచ్చించారని వివరించారు. గత సీజన్‌లో కానీ, నేటికీ రెండు టీఎంసీల నీళ్లు ఉపయోగించలేకపోయారని, అదే మొత్తాన్ని పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని వెచ్చించి ఉంటే పథకం పూర్తయ్యేదన్నారు. ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్మాణం పూర్తికి రూ.3937 కోట్లు మంజూరు చేయించి, రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఎత్తిపోతల పథకంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఓ నాయకుడి అకౌంట్‌లోకి రూ.ఒక కోటి 50లక్షలు వెళ్లాయని, భూములే లేకున్నా, వారి అకౌంట్‌లోకి ఎలా వెళ్లాయో విచారణ చేపట్టాలని కోరారు. కె.మంగ తండ్రి ఉద్యా, కె.మంగ భర్త రవి, రవి తండ్రి రాంచంద్రయ్య పేర్లపై వారి అకౌంట్‌లలో రూ.ఒక కోటి 50లక్షలు జమ అయ్యాయని వివరించారు.

జీవో 69తో రైతుల్లో పండుగ వాతావరణం

అసెంబ్లీలో నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి




నారాయణపేట, ఫిబ్రవరి 15 : ఈ ప్రాంత రైతుల చిరకాల వాంఛ జీవో 69 నారాయణపేట - కొడంగల్ ఎత్తి పోతల పథకానికి సీఎం రేవంత్‌రెడ్డి రూ.2,945 కోట్లు మంజూరితో పరిపాలనా అనుమతి ఇవ్వడంతో ఈ ప్రాంత రైతుల్లో పండుగ వాతావరణం నెలకొందని నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. గురువారం అసెంబ్లీలో తొలిసారి ఎమ్మెల్యే తన గళాన్ని విప్పారు. ఎంతో కాలంగా సాగునీరు లేక వలసలు వెళ్తున్న రైతాంగం కృష్ణానది పారుతున్న కారణంగా తిరిగి తమ స్వగ్రామాలకు వచ్చి పంటలను సాగు చేస్తారన్నారు. సాగు నీటి రాకతో వెనుకబడ్డ నారాయణపేట ప్రాంతం అభివృద్ధి చెందుతోందన్నారు. ఈ ప్రాజెక్టు వల్ల లక్ష ఎకరాలకు సాగు నీరు అందుతోందని, ఈ సందర్భంగా నిధులు మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి నియోజకవర్గ ప్రజల తరఫున ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా చేనేత కార్మికుల ప్రయోజనం కోసం ఈ ప్రాంతంలో చేనేత పార్కుతో పాటు యువత కోసం పరిశ్రమలను నెలకొల్పాలని కోరారు. వైద్యుల కొరత దృష్ట్యా పీహెచ్‌సీలతో పాటు జిల్లా ఆసుపత్రిలో పూర్తి స్థాయిలో వైద్యులను నియమించాలని ఆరోగ్య శాఖ మంత్రి దామోదర నరసింహను ఎమ్మెల్యే పర్ణికారెడ్డి కోరారు.

అంతర్జాతీయ పోటీల్లో పతకం సాధించాలి

గద్వాల అర్బన్, ఫిబ్రవరి 15 : అంతర్జాతీయ షూటింగ్ బాల్ పోటీల్లో మంజునాథ్ ఉత్తమ ఆటతీరును ప్రదర్శించి పతకంతో తిరిగి రావాలని డీవైఎస్‌వో డాక్టర్ బీఎస్ ఆనంద్ ఆకాంక్షించారు. జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియం మైదానంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో క్రీడాకారుడు మంజునాథ్‌ను ఎస్‌జీఎఫ్ కార్యదర్శి జితేందర్‌తో కలిసి ఘనంగా సన్మానించి, అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంజునాథ్ టగ్ ఆఫ్ వార్‌లోనూ నాలుగు సార్లు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. షూటింగ్ బాల్ పోటీల్లో నాలుగు సార్లు జాతీయ స్థాయిలో రాణించారని, కబడ్డీ జాతీయ స్థాయి పోటీల్లోనూ పాల్గొన్నారని తెలిపారు. వచ్చే నెల మొదటి వారంలో ఢిల్లీలో నిర్వహించనున్న అంతర్జాతీయ పోటీల్లో ప్రతిభ కనబరచి జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో షూటింగ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణయ్య, పీఈటీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు హైమావతి, పీఈటీలు రజనీకాంత్, నరసింహరాజు, సతీష్, మోహనమురళి, గద్వాల ఫుట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ విజయ్‌కుమార్, రాజేందర్ పాల్గొన్నారు.



క్రీడాకారుడిని సన్మానిస్తున్న డీవైఎస్‌వో డాక్టర్ బీఎస్ ఆనంద్





ప్రత్యేక అధికారినంటూ వార్డెన్ హల్‌చల్

కలెక్టర్‌కు ఎంపీపీ ఫిర్యాదు

భూత్పూర్, ఫిబ్రవరి 15 : తాను సేవాలాల్ జయంతి ఉత్సవాలకు ప్రత్యేక అధికారినని సేవాలాల్ జయంతి వేడుకల్లో పాల్గొని, స్టేజీపై ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి పక్కన కూర్చుని ఓ హాస్టల్ వార్డెన్ హల్‌చల్ చేస్తూ కార్యక్రమంలో ప్రసంగించారు. గురువారం సంత్ సేవాలాల్ జయంతి సందర్భంగా గిరిజన సంఘం మండల నాయకులు స్థానికంగా ఉన్న ఓ ప్రవేటు ఫంక్షన్ హాల్లో వేడుకలను జరుపుకున్నారు. అయితే తాను ఈ వేడుకలకు ప్రత్యేక అధికారినని, సేవాలాల్ జయంతి వేడుకలను నేనే దగ్గర ఉండి జరిపించాలని గిరిజన వార్డెన్ (నకిలీ ప్రత్యేక అధికారి) చెప్పడంతో నిజమే ఉండవచ్చని గిరిజనులు వేడుకల్లో పాల్గొనేందుకు అవకాశం కల్పించారు. అయితే ఈ విషయంలో అనుమానం వచ్చిన ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి కలెక్టర్‌కు ఫోన్ చేసి ఆరా తీశారు. ఏ అధికారిని నియమించలేదని, రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ రవినాయక్ వివరించినట్లు ఎంపీపీ పాత్రికేయులకు తెలిపారు. సేవాలాల్ జయంతికి వచ్చింది ప్రత్యేక అధికారి కాదని, నకిలీ అని విషయం తెలుసుకున్న గిరిజనులు వాపో యారు. నకిలీ అధికారిపైన కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు ఎంపీపీ తెలిపారు.

ఏఐసీసీ జాతీయ ఓబీసీ సెల్‌కో ఆర్డినేటర్‌గా కేతూరి వెంకటేశ్

మహబూబ్‌నగర్/ పాన్‌గల్/ కొల్లాపూర్, ఫిబ్రవరి 15 : ఏఐసీసీ జాతీయ ఓబీసీ సెల్ కో ఆర్డినేటర్‌గా డా.కేతూరి వెంకటేశ్ నియమితులైనట్లు ఆయన గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏఐసీసీ జాతీయ ఓబీసీ సెల్ చైర్మన్ కెప్టెన్ అజయ్ సింగ్ యాదవ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానని అన్నారు. కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ, ప్రియాంకా గాంధీ, కొప్పుల రాజు, తెలంగాణ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కులకు కృతజ్ఞతలు తెలిపారు.



ఏఐసీసీ జాతీయ ఓబీసీ సెల్ చైర్మన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న కేతూరి వెంకటేశ్

నేడు నాబార్డ్ ఆధ్వర్యంలో రైతులకు ప్రత్యేక కార్యక్రమం

పాలమూరు, ఫిబ్రవరి 15 : నాబార్డు సహకారంతో శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని శిల్పారామంలో ప్రత్యేక స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి బి.వెంకటేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్, వన్ డిస్ట్రిక్ వన్ ఎగ్జిబిషన్ అనే కార్యక్రమాన్ని నిర్వహించనుందన్నారు. ఈ సంచలనాత్మక పైలట్ ప్రాజెక్టు తెలంగాణలోని మూడు జిల్లాలు భద్రాద్రికొత్తగూడెం, మహబూబ్‌నగర్, నిజామాబాద్‌లలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 16న ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు శిల్పారామంలో ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయం, నీటి పారుదల, వ్యర్థాల నిర్వహణ, పాడి పరిశ్రమ, గ్రామీణాభివృద్ధిలో అట్టడుగు సవాళ్లను పరిష్కరించేందుకు మార్కెట్‌కు సిద్ధంగా ఉన్న తక్కువ ధర ఆవిష్కరణలను ప్రదర్శించడానికి ఓడీఓఈ 30మంది పల్లె సృజన, టీఎస్ఐపీ ఆవిష్కర్తలను ఒకచోట చేర్చి, టీఎస్ఐసీచే నిశితంగా పరిశీలించి ప్రోత్సహించబడిందన్నారు.

ఉరి వేసుకొని యువకుడి ఆత్మహత్య



మేకల రాజు (ఫైల్)

మక్తల్, ఫిబ్రవరి 15 : కుటుంబ కలహాలతో ఓ యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన నారాయణపేట జిల్లా మక్తల్ మండలం పంచదేవ్‌పహాడ్ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మేకల రాజుకు కృష్ణ మండలం గుడెబల్లూర్ గ్రామానికి చెందిన జ్యోతితో ఏడేళ్ల క్రితం వివాహం జరిపించారు. కాగా తరచూ భార్యాభర్తలు గొడవపడేవారు. ఈనెల 13న గొడవ పడి మేకల రాజు ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యుల సూచన మేరకు అదే రోజు జ్యోతి పుట్టింటికి వెళ్లిపోయింది. ఈనెల 15న తిరిగి ఇంటికి వచ్చిన మేకల రాజు తన భార్య పుట్టింటికి వెళ్లిన విషయం తెలుసుకొని భీమా కాల్వ సమీపంలో చెట్టుకు ఉరి వేసుకొన్నాడు. అటుగా వెళ్తున్న వారు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించా రు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని శవాన్ని మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి వెంకటయ్య ఫిర్యాదు మేర కు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భాగ్యలక్ష్మీరెడ్డి తెలిపారు.



పంచవటి మనదే!

అయోధ్యలో శ్రీరామ విగ్రహ ప్రాణప్రతిష్ఠ అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ శ్రీరామ వనవాస మార్గం గురించి వివరించారు. ఆ వివరాలకు సంస్కృత రామాయణంలో వాల్మీకి రచించిన దానికీ తేడా ఉంది. అయోధ్య నుంచి ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో ఉన్న భరద్వాజ ఆశ్రమానికి, మధ్యప్రదేశ్‌లోని చిత్రకూటానికి, మహారాష్ట్రలోని నాసిక్ దగ్గర ఉన్న పంచవటికి, ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా లేపాక్షికి, కర్ణాటకలోని కిష్కింధకు, తమిళనాడులోని రామేశ్వరానికి, అక్కడి నుంచి శ్రీలంకకు శ్రీరాముడు పయనించాడనడం సరికాదేమో! ప్రధాని తన ప్రసంగంలో లేపాక్షి, నాసిక్‌లోని పంచవటుల గురించి ప్రస్తావించారే కానీ... దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధి చెందిన భద్రాచల రామాలయం సమీపంలోని పంచవటి గురించి కానీ, అసలు ఆ ఆలయం గురించి కానీ కనీసం ప్రస్తావించలేదు. ఇది తెలుగువారిని ఒకింత నిరాశకు గురిచేసిందనాలి. అయోధ్య నుంచి లంక దాకా శ్రీరాముడి ప్రస్థానం, తిరుగు ప్రయాణంలో అయోధ్యకు వస్తూ సీతకు రాముడు చూపించిన ప్రదేశాలు వావిలికొలను సుబ్బారావు (వాసుదాసు)గారి 'ఆంధ్ర వాల్మీకి రామాయణం' (మందరం) వ్యాఖ్యానంలో వివరంగా ఉన్నాయి.

అరణ్యాలకు బయలుదేరిన సీతారామలక్ష్మణులు తామసా నదీ తీరం, ఉత్తరకోసల దేశం, వేదశ్రుతి నది, గోమతీ నది, దక్షిణ కోసల దేశ సరిహద్దులు దాటి... గంగానదీ తీరంలోని శృంగబేరి పురాన్ని చేరారు. గుహుడి సాయంతో గంగను దాటి, గంగా యమున సంగమ స్థలిలోని భరద్వాజ ముని ఆశ్రమానికి వెళ్ళారు. యమునను దాటి, నీలవన మార్గంలో పయనించి, మందాకినీ సరయూ నది దగ్గరలో ఉన్న చిత్రకూటం చేరారు. అక్కడ వాల్మీకిని చూశారు. చిత్రకూటంలో లక్ష్మణుడు పర్ణశాల నిర్మించాడు. భరతుడు చిత్రకూటానికి వచ్చి, వెళ్ళాక... వారు అత్రి మహాముని ఆశ్రమానికీ, అనంతరం దండకారణ్యంలో ప్రవేశించి, విరాధుణ్ణి సంహరించి, శరభంగ మహర్షి ఆశ్రమానికీ, అటు నుంచి సుతీక్ష్ణాశ్రమానికీ, మాండకర్ణి ఆశ్రమానికీ ప్రయాణించారు. అగస్త్యుణ్ణి ఆయన ఆశ్రమంలో దర్శించుకున్నారు. పంచవటి అనే నివాస యోగ్యమైన స్థలం రెండు ఆమడల దూరంలో ఉందని అగస్త్యుడు సూచించాడు. అగస్త్యుడు చెప్పిన మార్గంలో వెళ్తూ, దారిలో ఒక మర్రి చెట్టు మీద ఉన్న జటాయువును రాముడు కలిశాడు. తరువాత సీతా లక్ష్మణ సమేతుడై పంచవటిని చేరుకున్నాడు. అక్కడ పర్ణశాల నిర్మించమని లక్ష్మణుడికి చెప్పాడు. లక్ష్మణుడు కుటీరాన్ని సిద్ధం చేశాడు. అవే ఇప్పటికీ భద్రాచలానికి 30 కిలోమీటర్ల దూరంలో ఎందరో భక్తులను ఆకర్షిస్తున్న పంచవటి, పర్ణశాలలు. భద్రాచలం సమీపంలో ఉన్నది పర్ణశాల కాదనీ, అది నాసిక్‌కు దగ్గరగా ఉందనీ చెప్పడం పూర్తిగా సత్యదూరం.

పంచవటి గోదావరీ తీరంలో ఉందనేది నిర్వివాదాంశం. అక్కడ గోదావరి ఉత్తరం నుంచి దక్షిణానికి పారుతూ ఉండాలి. ఎందుకంటే సీతాపహరణం తరువాత... సీతను రావణుడు తీసుకువెళ్ళినది దక్షిణ దిక్కుగానని మృగాలు, పక్షులు సూచించిన మేరకు... రామలక్ష్మణులు గోదావరీ తీరాన మొదట నైరుతి దిశగా వెళ్ళారు. తరువాత దక్షిణంగా వెళ్ళారు. గోదావరీ తీరంలో వారు జటాయువును చూశారంటే... గోదావరి నది జటాయువు పడిన స్థలం వరకూ... దక్షిణాభిముఖంగా పారుతూ ఉండాలి. జటాయువుకు గోదావరీ జలాలతో నివాపాలు (తిలోదకాలు) విడిచారు. అక్కడి నుంచి రామ లక్ష్మణులు తూర్పుగా వెళ్ళడానికి ఏరు అడ్డం వస్తుంది కాబట్టి... నైరుతి దిశగానే మూడు కోసుల దూరం పయనించారు. కొంత తూర్పుగా వెళ్తే కాని జటాయువు చెప్పిన దక్షిణ మార్గం కనిపించదు కాబట్టి... అక్కడి నుంచి మూడు కోసులు తూర్పుగా వెళ్ళారనుకోవాలి. అంటే అప్పుడు వారు.. ఇప్పటి భద్రాచలం దగ్గర, గోదావరి నదికి దక్షిణాన ఉన్నారు. అలా వచ్చారు కాబట్టి గోదావరి దాటవలసిన పని లేదు. ఆ కారణం వల్ల పంచవటి గోదావరి నదికి పడమటి తీరాన ఉందనే విషయం స్పష్టంగా అంగీకరించాలి. తూర్పున ఉన్నట్టయితే గోదావరి దాటే ఉండాలి. ఇప్పటి పర్ణశాలే యదార్థమయిన పంచవటి అయినా కావాలి. లేని పక్షంలో ఇప్పుడు అందరూ భావిస్తున్న పర్ణశాలకు ఎదురు ఒడ్డున, చక్కటి పంచవటి ఉండేదని మాత్రం నిర్ధారణగా చెప్పవచ్చు. నాసిక్ దగ్గర పంచవటి ఉన్నదనీ, అక్కడి నుంచి దక్షిణంగా రామ లక్ష్మణులు వెళ్ళారనీ చేసే వాదన రామాయణానికి విరుద్ధం. పంచవటి గోదావరీ నది పశ్చిమ తీరాన ఉందనడానికి స్థలం ఆధారంగా ఉంది. పర్ణశాలకు ఎదురుగా ఉన్న గుట్ట దగ్గర రావణాసురుడు తన రథాన్ని నిలిపాడని అంటారు. కారణం... సీతాదేవిని ఎత్తుకురాగానే రథం సిద్ధంగా ఉండాలి కాబట్టి. నదికి ఒక ఒడ్డున రథం, మరో ఒడ్డున సీత ఉంటే... సీతాపహరణం సాధ్యమయ్యేది కాదనుకోవాలి. కాబట్టి పడమటి దిక్కున ఉన్న పంచవటి దగ్గర సీతాపహరణం జరిగి ఉండాలి. అలాగే అక్కడికి సమీపంలోనే 'సీత గుట్టలు' అనే పెద్ద పర్వతం ఉంది. ఖరుడు యుద్ధానికి వచ్చినప్పుడు... రామలక్ష్మణులు అక్కడ ఉన్న కారణంగా ఆ గుట్టలకు ఆ పేరు వచ్చిందంటారు.

హంపీ... పంప ఒకటి కాదు...

ఇప్పటి హంపీయే అప్పటి పంప అనీ, అక్కడే పర్ణశాల ఉన్నదనీ అనడం కూడా సరికాదు. రామలక్ష్మణులు లంకకు వెళ్ళేటప్పుడు ఏ మార్గం నుంచి వెళ్ళినా, తిరిగి వచ్చేటప్పుడు... విమానంలో తక్కువ దూరంలో ప్రయాణించే విధంగా... లంక నుంచి సముద్రం దాటాక... రామేశ్వరం నుంచి అయోధ్యకు వెళ్ళారనేది అందరూ అంగీకరించినదే. అలాంటప్పుడు ఎడమ వైపు కిష్కింధ, కుడివైపున పంచవటి ఉండి ఉండాలి. ఆ మార్గానికీ నాసిక్‌కూ సంబంధమే లేదు. కాబట్టి పంచవటి... నాసిక్ కానే కాదు. కావడానికి వీల్లేదు. సీతారామలక్ష్మణులు చిత్రకూటం నుంచి దక్షిణంగా ఋక్షవంతానికి వచ్చి, పశ్చిమాభిముఖంగా నాసిక్‌ను చేరినట్టయితే... మార్గమధ్యంలో

> పంచవటికి దగ్గరలోనే పద్మ సరస్సు ఉందని 'వాల్మీకి రామాయణం' చెబుతోంది. అలాంటి పెద్ద చెరువొకటి ఉండేదని అక్కడ ఉండే కోయలు చెబుతూ ఉంటారు. ఆ చెరువుకూ, గోదావరికీ మధ్య పంచవటి ఉంది.

వింధ్య పర్వతాన్ని, నర్మద, తపతీ నదులను దాటి... విదర్భ మీదుగా ప్రయాణించవలసి ఉంటుంది. వాటిని వారు దాటినట్టయితే... వాల్మీకి తప్పకుండా రాసేవాడు. రామలక్ష్మణులు దక్షిణానికి వచ్చి, ఆ తరువాత ఆగ్నేయంగా కిష్కింధకు వచ్చారనడం రామాయణానికి ప్రత్యక్ష విరుద్ధమని చెప్పాలి. నిజానికి...వారు నైరుతి మూలగా, నైరుతిగా వెళ్ళి, కబంధుణ్ణి చంపి, పడమరగా వెళ్ళి, పంప (తుంగభద్ర) చేరి, పడమరలో ఉన్న శబరి గుహకు వెళ్ళారు. జటాయువు గుట్ట దగ్గర నుంచి నైరుతికి వస్తేనే కిష్కింధకు రాగలరు. అలాకాకుండా ఆగ్నేయ మూలగా వెళ్ళి ఉంటే... సముద్రతీరానికి చేరేవారే తప్ప కిష్కింధకు కాదు. ఆగ్నేయమూలగా వారు ప్రయాణించారని రామాయణంలో ఒక్క మాటయినా లేదు.

సీతారామలక్ష్మణుల వనవాసం చివర్లో... సీతాపహరణం కోసం రావణుడు, మారీచుడు కలిసి దండకారణ్యంలోని రామచంద్రుడి ఆశ్రమానికి చేరుకున్నారని 'వాల్మీకి రామాయణం'లో ఉంది. పర్ణశాలకు ఉత్తరాన పర్వతాలు, తూర్పున గోదావరి, దక్షిణ, పడమర దిశల్లో అడవి ఉన్నాయి. రాముణ్ణి మారీచుడు పడమరగానే తీసుకువెళ్ళాడు. రావణుడు వెళ్ళాల్సింది దక్షిణ మార్గాన కాబట్టి... ఆ దోవలో రాముడు ఉండకూడదని మారీచుడు అలా చేశాడు. సీతను రావణుడు అపహరించుకుపోతున్నప్పుడు... పర్ణశాలకు మైలు దూరంలోని వృక్షం దగ్గర జటాయువు ఎదురయింది. రావణుడు, జటాయువు మధ్య యుద్ధం అయిదారు మైళ్ళ దూరంలోని దుమ్ముగూడెం దగ్గరున్న జటాయువు గుట్ట వరకూ సాగింది. రావణుడు సీతను ఎత్తుకొని, పర్ణశాల నుంచి బయలుదేరి, కిష్కింధ మీదుగా, పర్వతాలు, తటాకాలు దాటి, సముద్రాన్ని సమీపించి, లంకకు పోయాడనుకోవాలి. ఇవన్నీ పర్ణశాల ఎక్కడుందో తెలిపే అంశాలు.

సీతాన్వేషణలో భాగంగా రామలక్ష్మణులు క్రౌంచారణ్యం, మతంగవనం, పంపానది ఒడ్డున ఉన్న ఋశ్యమూక పర్వతం మీదుగా వెళ్ళారు. అప్పటివరకూ వారు దక్షిణ దిక్కుగానే ప్రయాణం చేశారు. శబరి ఆశ్రమానికి తూర్పు దిక్కులోనే పోవాలి కాబట్టి... వారు పడమరగా వెళ్ళి, తూర్పుకు తిరగాల్సి ఉంటుంది. నాసిక్ దగ్గర పంచవటి ఉన్నదనే వారి వాదనకు ఇది పూర్తిగా వ్యతిరేకం. ఆ తరువాత వారు కిష్కింధ వెళ్ళారు. రావణుడితో యుద్ధానికి వెళ్ళేదాకా ప్రస్రవణ పర్వతం మీద ఉన్నారు. కిష్కింధకు ఆగ్నేయంగా ఉన్న లంకకు పోతూ మహేంద్ర పర్వతం ఎక్కారు. రావణ వధ అనంతరం సీతా సమేతంగా అయోధ్యకు పుష్పక విమానం మీద తిరుగు ప్రయాణం కావడం... వనవాసంలో భాగం. ఆ తిరుగు ప్రయాణంలో ఈ ప్రదేశాలన్నీ సీతకు రాముడు చూపించడం కొసమెరుపు.

(వాసుదాసు గారి 'ఆంధ్రవాల్మీకి రామాయణం' (మందరం) ఆధారంగా)

● వనం జ్వాలా నరసింహారావు

పర్వదినం



జగత్ చైతన్యకారకుడు

బ్రహ్మస్వరూపముదయే మధ్యాహ్నేతు మహేశ్వరః
సాయం సంధ్యే సదా విష్ణుం త్రయీమూర్తిర్దివాకరః

సూర్యుడు త్రిమూర్త్యాత్మకుడు. ముల్లోకాలలోని ప్రాణులతో... త్రికాలాలలో పూజలు అందుకుంటున్న ప్రత్యక్ష దైవం. ఆదిత్యుడు, దివాకరుడు, సూర్యనారాయణుడు... ఇలా ఆయనకు ఎన్నో నామాలు. ఈ చరాచర జగత్తుకు వెలుగును, తేజస్సును ఆయన ప్రసాదిస్తాడు. అదితి-కశ్యపులకు ఆయన జన్మించిన రోజైన మాఘ శుద్ధ సప్తమి... 'రథసప్తమి'గా ప్రసిద్ధిచెందింది. ఉత్తర దిశగా సూర్యుడి గమనం ఈ రోజే ఆరంభమవుతుందని 'మత్స్యపురాణం' చెబుతోంది. ముప్ఫై మూడు కోట్ల మంది దేవతలు ఉన్నారని మనం చెప్పుకొంటున్నా... మనకు నిత్యం దర్శనమిచ్చే దైవం ఆదిత్యుడే. ఈ సృష్టిలో పన్నెండుమంది ఆదిత్యులు ఉన్నారనీ, సమస్త జీవజాలానికీ, సృష్టివిధానానికీ వారే ఆధారభూతులనీ 'భవిష్యపురాణం' చెబుతోంది. నవగ్రహాలలో మనకు కనిపించే ఏడు గ్రహాలను వారంలోని ఏడు రోజులకు పేర్లుగా పూర్వ ఋషులు నిర్ణయించారు. ఆదిత్యుని పేరిట ఆదివారాన్ని స్థిరపరిచారు.

సూర్యుడు మానవుల మనుగడకు ఆధారభూతుడు. కాంతికి, శక్తికి, చైతన్యానికి కారకుడు. సమస్త జ్ఞాన, విజ్ఞానాలకు అధిపతి. ఆయనను కర్మసాక్షిగా, స్థితికారకుడిగా పురాణాలు, ఇతిహాసాలు అభివర్ణించాయి. సూర్యుడి శక్తివల్లనే భూమండలంతో సహా ఇతర గ్రహాలు సంచరిస్తున్నాయి. ఆయనాలు, ఋతువులు ఏర్పడడానికి సూర్యగమన శక్తే కారణం. యజ్ఞాగ్నిగా సౌర శక్తిని మన ఋషులు దర్శించారు. సూర్య, భూగ్రహాల మధ్య ఉన్న సంబంధాన్ని విజ్ఞానపరంగా విశ్లేషించి... జ్యోతిష శాస్త్రాన్ని నిర్మించారు. మాసాలు, పక్షాలు, తిథులను నిర్దేశించి పంచాంగ శాస్త్రాన్ని ఆవిష్కరించారు. గ్రహాలు, రాశుల సంచారాలు, కలయికలను పరిశీలించి... వాతావరణ విజ్ఞానం అందించారు. ఇంతటి మహోన్నతమైన విజ్ఞానానికి ఆధారం సూర్యభగవానుడే.

ఆధ్యాత్మికంగా పరిశీలిస్తే.. 'అఘము' అంటే పాపం... 'మా' అంటే తొలగించడం. మాఘ మాసంలో వచ్చే సూర్యజయంతి రోజున ఆయనను అర్చిస్తే పాపాలన్నీ తొలగిపోతాయనేది శాస్త్రవచనం. రథసప్తమి నాడు ఉత్తరాభిముఖంగా... రథంలో సూర్యుడు పయనిస్తాడు. ఆ రథానికి ఒకటే చక్రం. దానికి పన్నెండు ఆకులు. అవి పన్నెండు మాసాలకు సంకేతం. ఆ రథానికి ఒకటే అశ్వం. 'ఏకో అశ్వోవహతి సప్తనామా' అని చెప్పింది ఋగ్వేదం. ఆ రథంలో అధిష్ఠితుడైన సూర్యుని కాంతి ఏడు వర్ణాలుగా... కిరణాలుగా ప్రసరితమవుతుంది. వాటినే ఏడు అశ్వాలుగా పరిగణిస్తారు. ఈ విశ్వమంతా ఆ కిరణాల విలాసమే. అవి ఆరోగ్యప్రదాలని, సూర్యోదయవేళ ఆ లేత కిరణాలు శరీరంపై సోకితే... శారీరక, మానసిక రుగ్మతలు తొలగిపోతాయని, సూర్యనమస్కారాలతో దారుఢ్యం కలుగుతుందనీ ఆయుర్వేద, యోగ శాస్త్రాలు చెబుతున్నాయి. ఆదిత్యుని ద్వాదశనామాలు పఠిస్తూ, సూర్యుణ్ణి ప్రార్థనలు చేస్తే... ఆరోగ్య, ఆధ్యాత్మిక ప్రయోజనాలు చేకూరుతాయన్నది పెద్దల మాట.

● ఆయపిళ్ళ రాజపాప

వేడుక

వన వేలుపుల మహా జాతర

గిరిజనుల ఆరాధ్య దేవతలుగా, ఆపదలో ఉన్నవారిని ఆదుకొని, వారి కష్టాలు తీర్చే వేలుపులుగా వాసికెక్కారు సమ్మక్క, సారలమ్మ. ఆ వనదేవతలకు నిర్వహించే జాతర... తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధి చెందింది. అంతేకాదు... ఇది ఆసియాలో అతి పెద్ద గిరిజన జాతర. మన దేశంలో కుంభమేళా తరువాత అత్యధికంగా భక్తులు హాజరయ్యే వేడుక. ఈ మహా జాతరకు ఇతర రాష్ట్రాల నుంచి కూడా గిరిజన, గిరిజనేతర భక్తులు భారీ సంఖ్యలో హాజరవుతారు.

రెండేళ్ళకొకసారి తెలంగాణలోని ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం గ్రామంలో... సమ్మక్క-సారక్క జాతరను జరుపుతారు. ఇది చారిత్రక ప్రాధాన్యం ఉన్న సంబరం. పదమూడో శతాబ్దంలో... నేటి జగిత్యాల మండల ప్రాంతంలోని పొలవాస లేదా పొలస ప్రాంతాన్ని గిరిజన దొర మేడరాజు పరిపాలించేవాడు. ఆయన తన కుమార్తె సమ్మక్కను మేనల్లుడైన మేడారం పాలకుడు పగిడిద్దరాజుకు ఇచ్చి వివాహం చేశాడు. ఆ దంపతులకు సారలమ్మ, నాగులమ్మ, జంపన్న అనే ముగ్గురు సంతానం కలిగారు. రాజ్యవిస్తరణ కాంక్షతో... కాకతీయ ప్రభువైన మొదటి ప్రతాపరుద్రుడు పొలవాస మీద దండెత్తాడు. ఆ దాడిని తట్టుకోలేక మేడరాజు... మేడారంలో అజ్ఞాతవాసం గడిపాడు. మరోవైపు కాకతీయులకు సామంతుడైన పగిడిద్దరాజు కరువు కారణంగా కప్పం కట్టలేకపోయాడు. కప్పం కట్టకపోవడంతోపాటు మేడరాజుకు ఆశ్రయం ఇచ్చినందుకు ఆగ్రహించిన కాకతీయ ప్రభువు మేడారంపై మీద సైన్యంతో విరుచుకుపడ్డాడు. భీకరంగా జరిగిన యుద్ధంలో... మేడరాజు, పగిడిద్దరాజు, సారలమ్మ, నాగులమ్మ, సారలమ్మ భర్త గోవిందరాజులు మరణించారు. ఈ వార్త విన్న జంపన్న సంపెగవాగులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటి నుంచి ఆవాగు 'జంపన్నవాగు'గా ప్రసిద్ధి చెందింది.

మరోవైపు కాకతీయ సైన్యాన్ని సమ్మక్క వీరోచితంగా ఎదుర్కొని పోరాడింది. అయితే ప్రత్యర్థుల బలం ఎక్కువ కావడంతో... చివరికి ఆమె గాయపడింది. రక్తధారలతో యుద్ధభూమి నుంచి చిలుకలగుట్ట వైపు వెళ్తూ... మార్గమధ్యంలో అదృశ్యమయింది. సమ్మక్క కోసం ఆమె అనుచరులు వెతుకుతూ వెళ్ళారు. వారికి ఆమె కనిపించలేదు కానీ... ఒక పుట్ట దగ్గర పసుపు, కుంకుమ ఉన్న భరిణె దొరికింది. దాన్ని సమ్మక్కగా భావించి... రెండేళ్ళకు ఒకసారి మాఘశుద్ధ పౌర్ణమి రోజున... సమ్మక్క-సారక్క జాతర నిర్వహిస్తున్నారు. వంశపారంపర్యంగా గిరిజనులే పూజారులుగా ఉంటారు. తమ కోర్కెలు తీర్చాలని అమ్మవార్లకు భక్తులు మొక్కుకుంటూ బంగారాన్ని (బెల్లాన్ని) నైవేద్యంగా సమర్పించుకుంటారు. వారి వీరత్వాన్ని స్మరించుకుంటారు.

వందల ఏళ్ళ చరిత్ర కలిగిన ఈ జాతరను నలభై వరకూ చిలకలగుట్ట మీద గిరిజనులు మాత్రమే నిర్వహించేవారు. ఆ తరువాత అన్ని వర్గాల ప్రజలూ పాల్గొంటున్నారు. జనసందోహం ఏటేటా పెరుగుతూ ఉండడంతో జాతరను కొండ కింద నిర్వహించడం మొదలుపెట్టారు. అమ్మవార్లకు చిహ్నంగా గద్దెలు ఏర్పాటు చేశారు. అమ్మవార్లకు ప్రతిరూపాలైన కుంకుమ భరిణెలను జాతర సందర్భంగా గద్దెపైకి తీసుకువస్తారు. ఈ నాలుగు రోజుల జాతరలో తొలిరోజున కన్నెపల్లి నుంచి సారలమ్మను గద్దెపైకి తెస్తారు. ఆ మరునాడు చిలకలగుట్ట నుంచి సమ్మక్క గద్దెపైకి విచ్చేస్తుంది. మూడో రోజున భక్తులకు అమ్మవార్లు దర్శనమిస్తారు. చివరిరోజున అమ్మవార్లు తిరిగి వనప్రవేశం చేయడంతో జాతర ముగుస్తుంది.

● నూతి శివానందం

ఫిబ్రవరి 21 : కన్నెపల్లి నుంచి సారలమ్మను, పునుగొండ్ల నుంచి పగిడిద్దరాజును, కొండాయి నుంచి గోవిందరాజును గద్దెలపైకి తీసుకువస్తారు.
ఫిబ్రవరి 22: చిలుకల గుట్ట నుంచి కుంకుమభరిణె రూపంలో ఉన్న సమ్మక్కను గద్దెపైకి తెస్తారు.
ఫిబ్రవరి 23: భక్తులు మొక్కులను చెల్లించుకుంటారు.
ఫిబ్రవరి 24: గద్దెలపై భక్తులకు దర్శనమిచ్చిన సమ్మక్క, సారలమ్మ వన ప్రవేశం.
ఫిబ్రవరి 28: తిరుగువారం పండుగ.



అవధూత శిఖామణి



సేయ్ కృష్ణ - నవద్వీపే శ్రీ చైతన్య చంద్ర
సేయ్ బలరామ - సంగే శ్రీ నిత్యానంద

"**శ్రీకృష్ణుడు** నవద్వీపంలో శ్రీ చైతన్య మహాప్రభువుగా అవతరించగా, వారితో పాటు బలరాముడు నిత్యానంద ప్రభువుగా అవతరించాడ"ని 'చైతన్య చరితామృతం' గ్రంథం చెబుతోంది. పశ్చిమబెంగాల్‌లోని ఏకచక్రధామంలో... 1473లో మాఘ శుద్ధ త్రయోదశి రోజున... హడాయ్ పండిత్, పద్మావతి దంపతులకు శ్రీనిత్యానంద జన్మించారు. ఆ రోజున ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది హరేకృష్ణ భక్తులు శ్రీనిత్యానంద త్రయోదశి మహోత్సవాన్ని (ఈ ఏడాది ఫిబ్రవరి 22న) నిర్వహిస్తారు. శ్రీనిత్యానంద ప్రభువు ఆవిర్భావం గురించి 'వాయుపురాణం'లో బ్రహ్మదేవుడికి శ్రీకృష్ణుడు వివరిస్తూ "నా ప్రప్రథమ పరివ్యాప్త స్వరూపుడు, నాతో అభిన్నుడు అయిన బలరాముడు కూడా నిత్యానందునిగా నాతో పాటు భూలోకంలో అవతరించి... అవధూత శిఖామణిగా ప్రకాశిస్తాడు" అని తెలిపాడు.

> ఆది గురుతత్త్వ స్వరూపమైన శ్రీనిత్యానందుల కృప లేనిదే... శ్రీచైతన్యుల కృపకు ఎవరూ పాత్రులు కాలేరన్నది పూర్వాచార్యుల అభిప్రాయం.

త్రేతాయుగాన లక్ష్మణుడిగా శ్రీరామచంద్రుణ్ణి సేవించిన బలరాముడే... కలియుగ ధర్మమైన హరినామ సంకీర్తనా ఉద్యమంలో శ్రీచైతన్య మహాప్రభువుకు తోడ్పడేందుకు శ్రీనిత్యానంద రామునిగా అవతరించారు. అయితే మునుపటి అవతారాలకన్నా ఇది ఎంతో ప్రత్యేకమైనది. ఎందుకంటే... కృష్ణనామాన్ని గానం చేస్తూ, దాన్ని ప్రపంచమంతటా వ్యాపింపజేయడానికి ఒక విశుద్ధ భక్తుడిగా అవతరించడం దీని విశిష్టత. సామాజికంగా ఉన్నతులైనా ఆధ్యాత్మికంగా శోచనీయమైన స్థితిలో ఉన్నవారిని శ్రీ చైతన్యులు ఉద్ధరించి, కొన్నివేల మంది మాయావాద సన్న్యాసులకు విశుద్ధ భక్తిమార్గాన్ని చూపిస్తే... జగాయ్, మాధాయ్ లాంటి మ్లేచ్ఛులపైన సైతం శ్రీనిత్యానందులు కరుణ చూపి, వారిని ఉద్ధరించారు. ఈ ప్రయత్నంలో తన ప్రాణాలకే ప్రమాదం వాటిల్లినా... వెనుకంజ వేయలేదు. పతితులైనవారి మనస్సులను తన ఆపారమైన కృపతో, ఔదార్యంతో గెలిచి... వారిలో పరివర్తన తీసుకువచ్చారు. ఒక విధంగా శ్రీచైతన్య మహాప్రభువుకు కూడా సాధ్యం కానిది శ్రీనిత్యానంద ప్రభువు సాధించారు. అంతేకాదు... ఏకచక్రపురంలోని బంకిమరాయ మందిరంలో ఉన్న బంకిమరాయ విగ్రహంలో... శ్రీనిత్యానంద ప్రభువు ఐక్యమై, తన లీలలను చాలించారన్నది ఐతిహ్యం. ఆ విగ్రహానికి కుడివైపున జాహ్నవీదేవి, ఎడమవైపున రాధారాణి విగ్రహం దర్శనమిస్తాయి. పరమపవిత్రమైన నిత్యానంద త్రయోదశినాడు... ఆదిగురుతత్త్వమైన శ్రీనిత్యానందుల్ని ఆశ్రయించి అనుసరిద్దాం. శ్రీనిత్యానందుల కృప వల్ల 'హరేకృష్ణ' మంత్రాన్ని జపించేందుకు మరింత శక్తి మనకు లభిస్తుంది.


శ్రీసత్యగౌర చంద్రదాస ప్రభూజీ
అధ్యక్షుడు, హరే కృష్ణ మూవ్‌మెంట్,
హైదరాబాద్, 9396956984

విశేషం



జ్ఞాన కార్యసాధకుడు

ప్రథమో హనుమన్నామః ద్వితీయో భీమ ఏవచ
పూర్ణ ప్రజ్ఞ తృతీయస్తు భగవత్కార్య సాధకః

హనుమ, భీమ అవతారాల తరువాత వైష్ణవతత్త్వ యదార్థ రూపాన్ని పునఃప్రతిష్ఠించడానికి వాయుదేవుడు శ్రీమధ్వాచార్యులుగా అవతరించాడు. ఈ మూడు అవతారాలకు భేదం లేదని మనం గ్రహించాలి. పరమాత్మ, లక్ష్మీదేవి తరువాత సకల దేవతలలో ఉత్తముడు వాయుదేవుడు. అందుకే హరి సర్వోత్తముడైతే... వాయువు జీవోత్తముడు.

వేదప్రతిపాదితమైన వాయుదేవుడి మూడు అవతారాలను... శ్రీమధ్వాచార్యుల శిష్యుడైన శ్రీత్రివిక్రమ పండితాచార్యులు ప్రత్యక్షంగా దర్శించారు. ఒక రోజు మధ్వాచార్యులు ఎప్పటిమాదిరిగానే శ్రీకృష్ణునికి పూజ చేసి, నైవేద్య సమర్పణకు సిద్ధమైనప్పుడు... ఆయన శిష్యులు ద్వాదశ స్తోత్రాన్ని పఠించారు. స్తోత్ర పఠనం పూర్తయింది. నైవేద్య సమర్పణ ముగిసే సమయం వచ్చినా... మధ్వాచార్యులు చేసే ఘంటానాదం ఎంతసేపైనా వినబడలేదు. 'ఎందుకింత ఆలస్యమవుతోంది? ఆచార్యులవారు ఏం చేస్తూ ఉంటారు?' అనే కుతూహలంతో త్రివిక్రమ పండితారాధ్యులు మూసి ఉన్న తలుపును కొద్దిగా జరిపి, సందులోంచీ చూశారు. హనుమ, భీమ, మాధ్వ రూపాలతో శ్రీకృష్ణునికి తన గురువు పూజ చేస్తూ ఉండడం గమనించి... ఆనందాశ్చర్యాలతో మైమరచిపోయారు. ఏ తపస్సు చేసినా లభ్యం కాని ఆ అద్భుత దృశ్యాన్ని దర్శించి... ఆనందబాష్పాలు రాల్చారు. అప్రయత్నంగానే... సహజమైన శ్రేష్ఠకావ్యశైలిలో శ్రీమధ్వాచార్యుల అవతారత్రయాన్ని, రామ, కృష్ణ, వ్యాసత్రయరూపాన్ని వర్ణిస్తూ 'శ్రీహరివాయుస్తుతి'ని జగత్తుకు అందజేశారు. అది విన్న మధ్వాచార్యులు ప్రసన్నులై... స్వయంగా 'నరసింహనఖస్తుతి'ని రచించి, 'శ్రీహరివాయుస్తుతి'ని పఠించే సజ్జనులకు పూర్ణఫలాన్ని అనుగ్రహించారు.

శ్రీమధ్వాచార్యులు బదరీ క్షేత్రానికి వెళ్ళి, నారాయణుణ్ణి దర్శించారు. తన మొదటి గ్రంథమైన 'గీతాభాష్యాన్ని' రచించి, బదరీనాథుడికి సమర్పించారు. అర్జునుడికి శ్రీకృష్ణుడు భగవద్గీతను బోధిస్తున్నప్పుడు... కపిధ్వజుడిగా పూర్వావతారాల్లో ఆయన యుద్ధభూమిలో ఉన్నారు. అందుకే పరమాత్ముడే మెచ్చే విధంగా భగవద్గీతకు భాష్యం రాసే భాగ్యం ఆయనకు లభించింది.

శ్రీమధ్వాచార్యుల వ్యక్తిత్వం, తాత్త్వికత ఆయన రచించిన 37 గ్రంథాలలో సంపూర్ణంగా ప్రకటితమైంది. ఈ సంఖ్యలో మూడును, ఏడును కలిపి 'దశం' (పది)గా పరిగణిస్తారు. 'దశమతి' అంటే పూర్ణప్రజ్ఞులు... శ్రీ మధ్వాచార్యులు. అలాగే 'మూడూ ఇంటూ ఏడు' అంటే 21 అనేది మరో సంఖ్య. ఆనాడు మధ్వాచార్యులు తత్త్వవాదంతో పరిశీలించి, ఖండించిన సిద్ధాంతాల సంఖ్య అది. ఆయన బ్రహ్మసూత్రభాష్యం

> ఉడుపిలోని అనంతేశ్వర ఆలయంలో తన శిష్యులకు పాఠాన్ని బోధిస్తూ... అదృశ్యులై, వేదవ్యాసుని బదరికాశ్రమానికి శ్రీమధ్వులు చేరుకున్న రోజు... మాఘ శుద్ధ నవమి. దానినే సద్భక్తులందరూ 'మధ్వనవమి'గా జరుపుకొంటారు. ఆ పుణ్యదినాన శ్రీమధ్వాచార్యుల మహిమలను, ఆయన మానవాళికి అందించిన తత్త్వవాదాన్నీ శక్తి కొద్దీ స్మరిస్తే... శ్రీహరి కరుణకు పాత్రులవుతాము.

ఇరవై రెండవది. ఋగ్వేదంలోని ప్రథమ మండలంలో ఉన్న నలభై సూక్తాలకూ వేదార్థాల్ని వివరిస్తూ వ్యాఖ్యానం రాసి, వేదంలోని ప్రతి శబ్దార్థమూ శ్రీమహావిష్ణువును ఉద్దేశించినదేని మధ్వాచార్యులు నిరూపించారు. వేద, ఉపనిషత్తులలోని పరమాత్ముని తత్త్వజ్ఞాన సందేశాన్ని ప్రపంచానికి అందజేశారు.

● మధ్వ ప్రచార పరిషత్, 9440258841

కల్యాణం.. కమనీయం

- వైభవంగా బుగ్గ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాల సందర్భంగా బుగ్గ వేంకటేశ్వరస్వామికి వెండి కిరీటాలు బహూకరిస్తున్న భక్తులు

తెలకపల్లి, ఫిబ్రవరి 15 : భక్తుల కొంగుబంగారమైన పెద్దపల్లి బుగ్గ వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. కల్యాణోత్సవం సందర్భంగా వందలాది మంది భక్తులు హాజరయ్యారు. స్వామివారికి భక్తులు వెండి కిరీటాలు అందించారు. ఆలయ కమిటీ చైర్మన్ బీరెడ్డి జగదీశ్వర్‌రెడ్డి, శ్వేత దంపతులతో పాటు 20 జంటలు కల్యాణంలో కూర్చొన్నారు. ఎంపీటీసీ విజయమ్మ, గ్రామ పెద్దలు వెంకటయ్యగౌడ్, మదన్ గౌడ్, జగన్‌గౌడ్‌లతో సహా పలువురు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

కానిస్టేబుల్స్‌కు సన్మానం



కానిస్టేబుల్స్‌ను శాలువాతో సన్మానిస్తున్న ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్లలో పని చేస్తున్న నలుగురు హోంగార్డులు ఇటీవల జరిగిన కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్‌లో కానిస్టేబుల్‌గా ఎంపికైనందుకుగాను ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గోపీనాయక్-హెచ్‌జీ332-ఎంటీ సెక్షన్, దేవేందర్-హెచ్‌జీ895-ఎంటీ సెక్షన్, శ్రీనివాస్-హెచ్‌జీ100-ఎంటీ సెక్షన్, పాండు-786-కల్వకుర్తి పీఎస్‌లను శాలువాతో జిల్లా ఎస్పీ ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఇంకా ఎంతో ఎత్తుకు ఎదగాలని, ట్రైనింగ్ మంచిగా కంప్లీట్ చేసుకుని మళ్లీ జిల్లాకు వచ్చి మీ సేవలందించాలని అభినందించారు. జిల్లా ఏడీడీ ఎల్‌ఎస్‌పీ సీహెచ్‌రామేశ్వర్, ఏఆర్‌ఎస్‌ఐ పాష, ఇతర హోంగార్డులుపాల్గొన్నారు.

జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా డి.గాయత్రి



కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్‌కు కలిసి పూల మొక్క అందజేస్తున్న జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ డి.గాయత్రి

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా నూతన మద్య నిషేధం, అబ్కారీ అధికారిగా డి.గాయత్రి గురువారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. అనంతరం ఆమె కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. డి.గాయత్రి ఇంత వరకు వికారాబాద్ జిల్లా మద్యనిషేధం, అబ్కారీ అధికారిగా బాధ్యతలు నిర్వహించారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో పని చేసిన జిల్లా మద్యనిషేధం, అబ్కారీ శాఖ అధికారి షేక్ ఫయాజుద్దీన్ మల్కాజ్‌గిరి మేడ్చల్ జిల్లాకు బదిలీపై వెళ్లారు. నాగర్‌కర్నూల్ మునిసిపల్ నూతన శాఖ కమిషనర్ నరేష్‌బాబు గురువారం కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

'పోకిరీల ఆగడాలను షీ టీంతో అరికట్టాలి'

బిజినేపల్లి, ఫిబ్రవరి 15 : బిజినేపల్లి మండలంలోని పాలెం ఎస్వీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు వచ్చే విద్యార్థినులను వేధిస్తున్న పోకిరీల ఆగడాలను అరికట్టేందుకు షీటీంలు ఏర్పాటు చేయాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ కొండ్రెడ్డి చందు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శివశంకర్‌లు డిమాండ్ చేశారు. మండలంలోని పాలెంలోని కళాశాల ఆవరణలో గురువారం విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ కళాశాలకు వస్తున్న విద్యార్థినుల బస్టాండ్ సమీపంలో, అంబేడ్కర్ చౌరస్తాలో, కళాశాల గేట్ వద్ద పోకిరీల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసు శాఖ అధికారులు షీటీంలను ఏర్పాటు చేసి విద్యార్థినులను వేధిస్తున్న పోకిరీలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కళాశాల లోపలికి అనుమతి లేని వ్యక్తులను రానివ్వవద్దని కోరారు. వారి వెంట ఏబీవీపీ నాయకులు జయప్రకాష్, మొక్కల శాంతన్, అనిల్, మణిదీప్, బాలాజీ, ఇమ్రాన్ తదితరులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడల్లో రాణించాలి



క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ చేసిన జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.సురేందర్‌రెడ్డి

కల్వకుర్తి, ఫిబ్రవరి 15 : క్రీడాకారులు తమ నైపుణ్యాలను ప్రదర్శించి రాష్ట్ర స్థాయిలో రాణించాలని కల్వకుర్తి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.సురేందర్‌రెడ్డి, లయన్ డాక్టర్ దామోదర్‌రెడ్డిలు కోరారు. ఫిబ్రవరి 16 నుంచి 19వరకు సూర్యాపేట జిల్లా చింతలపాలెంలో జరిగే 33వ తెలంగాణ రాష్ట్ర స్థాయి కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే జట్లకు లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆమనగల్ క్రీడా దుస్తులను సమకూర్చింది. గురువారం క్రీడాకారులకు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.సురేందర్‌రెడ్డి, లయన్ డాక్టర్ దామోదర్‌రెడ్డి, ఆమనగల్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి యాదయ్యగౌడ్, జేఏసీ చైర్మన్ సదానందంగౌడ్, సభ్యులు ప్రకాశ్, మోహన్‌లాల్, భారతి, అధ్యాపకులు శ్రీనివాస్, రాజేష్, భీమేష్, మల్లేష్, లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

'గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం'

పెద్దకొత్తపల్లి, ఫిబ్రవరి 15 : గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి పర్చడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని జొన్నలబొగుడ గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు 15లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులు, నక్కలపల్లి గ్రామంలో 20లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఆయన భూమి పూజ చేశారు. అదేవిధంగా వెన్నచెర్ల గ్రామంలో మస్జీద్ నిర్మాణం కోసం ఆయన భూమి పూజ చేశారు. అదేవిధంగా నక్కలపల్లి గ్రామానికి చెందిన రవీందర్‌రెడ్డి రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురయ్యారు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీపీ పరామర్శించారు. ఎంపీటీసీలు రవికుమార్, మాజీ ఎంపీటీసీ దండు నరసింహ, నాయకులు మేకల చంద్రయ్య, మల్లేష్, బద్యానాయక్, ఆది, ధర్మేందర్, బైరాముడు, జంగం పెద్దరాజు, బాలింగాచారి, కొండల్‌రావు, కుర్మయ్య, బాస్కర్, రాములు, శ్రీశైలం, శంకర్ పాల్గొన్నారు.

అన్నప్రసాద వితరణకు బియ్యం సమర్పించిన భక్తులు

మన్ననూర్, ఫిబ్రవరి 15: ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ముచ్చింతల్‌లో ఈ నెల 28న సమతామూర్తి రామానుజాచార్యుల రెండో వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామంలోని 10 మంది భక్తులు సమతాదీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా మన్ననూరు వేణుగోపాల స్వామి ఆలయంలో ధ్వజస్తంభం వద్ద ఉన్నటువంటి రామానుజుల వారి విగ్రహం వద్ద గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వార్షికోత్సవాల సందర్భంగా ఈ నెల 28 నుంచి గ్రామాల్లోని భక్తుల నుంచి సేకరించినటువంటి బియ్యంతోనే తయారు చేసే అన్నప్రసాదాన్ని దైవ నివేదన అనంతరం భక్తులకు పంచుతారు. దీక్ష చేపట్టిన భక్తబృందం గ్రామంలోని ప్రజల నుంచి స్వచ్ఛందంగా బియ్యం సేకరణ చేశారు. వికాస తరంగిణి సభ్యులు జయమ్మ, ప్రభావతమ్మ, సరస్వతి, సంభు శ్రీనివాసులు, పులిజాల శేఖర్, ఆలయ అర్చకుడు నర్సింహాచార్యులు పాల్గొన్నారు.

సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాలు ప్రారంభం

- వాలీబాల్, కబడ్డీ పోటీలను ప్రారంభించిన అడిషనల్ కలెక్టర్ కుమార్‌దీపక్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అడిషనల్ కలెక్టర్ కుమార్‌దీపక్

కొల్లాపూర్, ఫిబ్రవరి 15 : బంజారాల ఆరాధ్యుడు సంత్ సేవాలాల్ మహారాజ్ 285 జయంతి ఉత్సవాలను కొల్లాపూర్ నియోజకవర్గ కేంద్రంలో గిరిజనుల సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా ప్రారంభించారు. సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా పట్టణంలోని గిరిజన సంఘం భవనం ఆవరణలో నిర్వహించిన కబడ్డీ, వాలీబాల్ క్రీడా పోటీలను జ్యోతి ప్రజ్వలన చేసి అడిషనల్ కలెక్టర్ కుమార్‌దీపక్ ప్రారంభించారు. మాజీ జడ్పీటీసీ మూడావత్ హనుమంతునాయక్ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ పంటలను పెంచు అడవిని ప్రేమించు అనే నినాదంతో ఆరేళ్లకే పశువుల కాపరిగా 9ఏళ్లకే బంజారా బతుకుల అధ్యయన శైలిగా, 15ఏళ్లకే అత్యంత ప్రభావశీలి సేవాకీయగా మారారు. బ్రిటీష్ పాలకులను బెదిరించి బంజారాల హక్కులపై పోరాడిన సంతు సేవాలాల్ మహారాజ్‌ను నేటి గిరిజనులు ఆదర్శంగా తీసుకుని తమ జాతి హక్కుల పరిరక్షణ కోసం, న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం పని చేయాలని ఆయన పేర్కొన్నారు. బంజారాల జాతి కోసం వారిని జాగృతం చేసి బంజారాలను చైతన్యం చేసిన సంతు సేవాలాల్‌ను మరో అంబేడ్కర్‌గా గిరిజనులు భావించి భావి తరాలకు ఆదర్శంగా ఉండాలని ఆయన కోరారు. 15, 16వ తేదీల్లో క్రీడా పోటీలు నిర్వహించి 16వ తేదీన బంజారా బందర్ భోగ్ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు సభా అధ్యక్షుడు హనుమంతునాయక్ పేర్కొన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరవుతారని ఆయన పేర్కొన్నారు. కొల్లాపూర్ మండల ఎంపీపీ భోజ్యానాయక్, పెద్దకొత్తపల్లి ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్, కోడేరు మాజీ జడ్పీటీసీ కేతావత్‌వసీరామ్‌నాయక్, మాజీ ఎంపీపీ కొత్త రామ్మోహన్‌రావు, కొల్లాపూర్ మునిసిపల్ కౌన్సిలర్లు షేక్.రహీంపాష, ఎండి.నయీమ్, వేణుగోపాల్, తహసీల్దార్ శ్రీకాంత్, ఎస్‌ఐ రిషికేష్‌లతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ సర్పంచ్ మేకల నాగరాజు, ఖాదర్‌పాష, ఎంపీటీసీ బాలునాయక్, గోపీనాయక్, భోజ్యానాయక్, రాముూనాయక్, లచ్చిరామ్‌నాయక్, రవినాయక్, రాంచందర్‌నాయక్, లోక్యానాయక్, బద్యానాయక్, కేతావత్ శంకర్‌నాయక్, గోవిందునాయక్, జైపాల్‌నాయక్, పాండునాయక్, శంకర్‌నాయక్, ఉద్యోగుల సంఘం నాయకులు శంకర్‌నాయక్, రమేష్, చంద్రశేఖర్‌నాయక్, జానునాయక్, పీఈటీలు రామన్‌గౌడ్, కుమార్, జయప్రసాద్, రామకృష్ణ, ప్రతాప్‌సింగ్ పాల్గొన్నారు.

● కల్వకుర్తి: సంతు సేవాలాల్ మహారాజ్‌ను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివరాం కోరారు. కల్వకుర్తి పట్టణంలో ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ శివరాం ఆధ్వర్యంలో డాక్టర్ యశోదబాయి, సిబ్బంది, గిరిజన ఉపాధ్యాయుల సమక్షంలో సంతు సేవాలాల్ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల ఆరాధ్య దైవం సంతు సేవాలాల్ మహారాజ్ అని పేర్కొన్నారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు డాక్టర్ శివరాం పండ్లు పంపిణీ చేశారు. గిరిజన ఉపాధ్యాయ సంఘం నాయకులు శ్రీను, శంకర్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

● బిజినేపల్లి: బంజారాల ఆరాధ్య దైవం సేవాలాల్ మహారాజ్ 285 జయంతి వేడుకలను పాలమూరు రంగారెడ్డి రిజర్వాయర్ నిర్వాసితుల ఆర్ అండ్ ఆర్ కాలనీలో ఆయన చిత్ర పటానికి మాజీ సర్పంచ్ ముడావత్ రమణి రాము నాయక్ పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా గిరిజనుల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. వార్డు సభ్యులు, నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

● వంగూరు: గిరిజనుల ఆరాధ్య దైవమైన సేవాలాల్ జయంతిని గురువారం మండలంలోని సర్వారెడ్డిపల్లితండాలో ఘనంగా నిర్వహించారు. గిరిజనులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం నాయకుడు సూర్యనాయక్ మాట్లాడుతూ సేవాలాల్ గిరిజనుల జీవితాలను ప్రభావితం చేశాడన్నారు. శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

● చారకొండ: మండల పరిధిలోని సారంబండతండాలో గురువారం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. భీందాస్‌నాయక్, రాంజా, బిచ్య, గాస్సీరాం, గోబ్రియ, శ్రీను, చందా, తార్య రాములు, హరి, జైరాం, శక్రు, జాంజు పాల్గొన్నారు.

● బల్మూరు: మండల వ్యాప్తంగా గిరిజన తండాల్లో గిరిజనుల ఆరాధ్య దైవమైన సంతు సేవాలాల్ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని నర్సాయిపల్లి, అంబగిరి, కొండనాగుల, బాణాల, రాంనగర్ కాలనీ, గోపాల్‌రావునగర్‌తండాలలో గిరిజనులు తమ కుటుంబీకులతో కలిసి గ్రామంలో సేవాలాల్ చిత్ర పటాన్ని పూల మాలలు వేసి గిరిజనుల లంబాడీలు ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఆయా గ్రామాల పెద్దలు దైవ పూజారులతో పాటు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

● లింగాల: బంజారాల ఆరాధ్యదైవమైన సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను గురువారం మండల కేంద్రంలో బంజారాలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చౌరస్తాలో సేవాలాల్ చిత్రపటాన్ని ఉంచి పలువురు బంజారా పెద్దలు, యువకులు పూల మాలలు వేసి నివాళుల ర్పించారు. శంకర్‌రాథోడ్, శ్రీనివాసరాథోడ్, రాజునాయక్, బాలాజీనాయక్, రాందాస్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.



అచ్చంపేటలో సేవాలాల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు

ఉద్యోగులకు సేవాలాల్ చేసిన కృషి మరువలేనిది

అచ్చంపేటటౌన్: ఉద్యోగులకు సేవాలాల్ చేసిన కృషి మరవలేనిదని జిల్లా అటవీశాఖ అధికారి రోహిత్ గోపిడి అన్నారు. సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని పురస్కరించుకొని గురువారం పట్టణంలోని ఫారెస్ట్ కార్యాలయంలో గిరిజన ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఉత్సవాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులకు సేవాలాల్ చేసిన కృషిని గుర్తుకు చేసి సేవాలాల్ మహారాజ్ అడుగు జాడల్లో నడవాలన్నారు. ఫారెస్ట్ అధికారులు ఆదిత్య, రాంబాబు, హన్మంతు, లచ్చునాయక్, ధగ్గునాయక్ తదితరులు పాల్గొన్నారు.

బంజారాల ఉన్నతి కోసం కృషి చేసిన మహనీయుడు



ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డితో గిరిజన నాయకులు

తిమ్మాజిపేట, ఫిబ్రవరి 15 : ప్రజాపాలనకు ప్రతినిధి బంజారాల ఉన్నతి కోసం కృషి చేసిన మహనీయుడు సంతు సేవాలాల్ అని ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి అన్నారు. తిమ్మాజిపేట మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన సంతు సేవాలాల్ జయంతి ఉత్సవాల్లో పాల్గొని మాట్లాడారు. మారుమూల ప్రాంతంలోని తండాలో జన్మించి తమను హింస పెడుతున్న బ్రిటీష్ వారితో పోరాడి జాతి పునర్నిర్మాణానికి చేసిన కృషి మరువలేనిదన్నారు. అదేవిధంగా లక్ష్మణ్‌నాయక్‌తండాలోను సేవాలాల్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహం నుంచి డప్పు మేళాలతో టపాసులు పేల్చుతూ గిరిజన మహిళలు ప్రత్యేక ఆకర్షణతో నృత్యాలు చేస్తూ పెద్ద ఎత్తున ఊరేగించారు. మాజీ ఎంపీపీ జయలక్ష్మీ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ హుసేనీ, మాజీ సర్పంచ్ సత్యం నాయక్, ఆయా గ్రామాల మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గిరిజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విశ్వశాంతి మహాయజ్ఞం

- ప్రారంభమైన జిల్లా స్థాయి భజన పోటీలు
- నేడు సూర్యభగవానుడి కల్యాణం



భలాన్‌పల్లి సూర్యభగవానుడి ఆలయంలో భక్తిశ్రద్ధలతో విశ్వశాంతి మహాయజ్ఞాన్ని ఆచరిస్తున్న భక్తులు

భలాన్‌పల్లి(తాడూరు), ఫిబ్రవరి 15 : మండలంలోని భలాన్‌పల్లిలో కొలువుదీరిన సూర్యనారాయణస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా స్వామి వారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం సూర్యభగవానుడి ఉత్సవ విగ్రహాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించిన అనంతరం ఆలయ ప్రాంగణానికి చేరుకున్నారు. విశ్వశాంతి మహాయజ్ఞంలో భాగంగా వివిధ గ్రామాల నుంచి వచ్చిన దంపతులు యజ్ఞ గుండాలపై కూర్చొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకుల ఆశీర్వచనాలు పొంది అన్నప్రసాదాలను స్వీకరించారు. జిల్లా స్థాయి భజన మండలి పోటీలను ప్రారంభించి వివిధ గ్రామాల నుంచి వచ్చిన భజన మండలి సభ్యులచే భజనలు నిర్వహించి వారి ప్రదర్శన ఆధారంగా న్యాయ నిర్ణేతలను ఏర్పాటు చేసి అన్ని జట్లు ప్రదర్శన అనంతరం శుక్రవారం విజేతలను ప్రకటించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఇదే రోజు మధ్యాహ్నం ఛాయాదేవి, ఉషాదేవి సమేత సూర్యభగవానుడి కల్యాణం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకుగాను ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పూర్తి చేశారు. మొత్తంగా భలాన్‌పల్లి గ్రామంలో సూర్యనారాయణస్వామి బ్రహ్మోత్సవాలు భక్తుల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు.

వెంకన్న స్వామికి బంగారు పూత ఆభరణాలు బహూకరణ



పాలెంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈవోకు బంగారుపూత అభరణాలను అందజేస్తున్న దాతలు

బిజినేపల్లి, ఫిబ్రవరి 14 : అలువేలు మంగ సమేత వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మాఘ రథసప్తమి పురస్కరించుకొని స్వామి వారికి బంగారు పూత పూసిన అభయ హస్తం, వామహస్తం అభరణాలను సమర్పించినట్లు దాత విశ్రాంత కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణగౌడ్, మంజుల దంపతులు తెలిపారు. పాలెం వెంకన్న స్వామి ఆలయంలో దాతలు సమర్పించిన అభరణాలకు గురువారం ఆలయ చైర్మన్ జున్న శేఖర్ రెడ్డి, ఈవో రంగారావులు స్వీకరించి ఆలయ ప్రధాన అర్చకులు రామానుజచార్యులచే శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు చేసి స్వామి వారికి అలకరించారు. అభరణాల విలువ రూ.లక్షా పది వేలు ఉంటుందని దాత కుటుంబ సభ్యులు డాక్టర్ శరత్ చంద్ర గౌడ్, శ్రీహితలు పేర్కొన్నారు. అనంతరం కుటుంబ సభ్యులందరికీ గోత్ర నామాలతో ప్రత్యేక పూజలు చేసి వేద పండితులు ఆశీర్వదించారు. వారి వెంట ఎంపీఈ శ్రీనివాస్ గౌడ్, గాడి సురేందర్, గంధం వెంకటేశ్వర్లు, సొప్పరి బాలస్వామి తదితరులు ఉన్నారు.

ఔటాన్ ప్రకారం పల్లి రైతులకు ధర నిర్ణయించాలి

- ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

అచ్చంపేటటౌన్, ఫిబ్రవరి 15: ఔటాన్ ప్రకారం వేరుశనగ రైతులకు ధర నిర్ణయించాలని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. గురువారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించి రైతులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రైతులకు అన్యాయం చేయకుండా ఔటాన్ తీసి ఆ తర్వాతనే ధర నిర్ణయించి రైతులకు చూపించాలన్నారు. వేరుశనగ పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తామని భరోసా ఇచ్చారు. రైతుల సమస్యలు ఉంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలి కానీ దాడులు చేయడం వల్ల అచ్చంపేట ప్రాంతానికి చెడ్డపేరు వస్తుందని రైతులకు నచ్చజెప్పారు. అచ్చంపేటలో దాడుల సంస్కృతికి చరమగీతం పాడాలని అన్ని వర్గాల ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. రైతుల ముసుగులో ఇలాంటి దాడులకు పాల్పడితే ఎంతటివారినైన వదిలిపెట్టమని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల తెలంగాణకు జరిగిన అన్యాయం గురించి అసెంబ్లీ సమావేశాలలో ప్రజలకు తెలియజేయడం జరిగిందన్నారు. వ్యవసాయ మార్కెట్ సిబ్బందితో కలిసి పలు సమస్యలపై చర్చించారు.

రైతుల ముందే ఔటాన్ తీసి చూయించారు. వ్యవసాయ మార్కెట్‌కు వచ్చే రైతులకు ఇబ్బందులు లేకుండా మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేస్తామన్నారు. వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ అరుణ, మార్కెట్ సెక్రటరీ నర్సింహులు, నాయకులు రాజేందర్, చంద్రమౌళి, శేఖర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

అచ్చంపేటటౌన్, ఫిబ్రవరి 15: దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఐఎన్‌టీయూసీ అచ్చంపేట తాలూకా అధ్యక్షుడు మహబూబ్ అలీ అన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక కర్షక ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా నేడు దేశవ్యాప్తంగా నిర్వహించే సమ్మెను విజయవంతం చేయాలని పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్యనాయకుల సమావేశంలో మాట్లాడారు. పది సంవత్సరాల బీజేపీ పాలనలో కార్మికులకు కర్షకులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందన్నారు. కేంద్రంలోని ప్రభుత్వ విధానాన్ని వ్యతిరేకిస్తూ నేడు జరిగే సమ్మెలో ప్రతి కార్మికుడు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు శ్రీరామ్ నాయక్,అన్ని మండలాల అధ్యక్షులు లింగాల బాలరాజు, చందు, రాంచంద్రయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

● కల్వకుర్తి: దేశవ్యాప్తంగా శుక్రవారం నిర్వహించే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు కోరారు. గురువారం కల్వకుర్తి పట్టణంలో సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలని ప్రచారం నిర్వహించారు. ఈ సమ్మెలో ప్రజలు, వివిధ వర్గాలు స్వచ్ఛందంగా పాల్గొనాలని ఆయన కోరారు.

● కొల్లాపూర్: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ నేడు దేశవ్యాప్త గ్రామీణ బంద్ నిర్వహిస్తున్నట్లు సీపీఎం మండల కార్యదర్శి బి.శివవర్మ పేర్కొన్నారు. గురువారం బంద్ జయప్రదం కోరుతూ పట్టణంలో నిర్వహించిన బైక్ ర్యాలీని జెండా ఊపి శివవర్మ ప్రారంభించారు. బైక్ ర్యాలీ కొల్లాపూర్ మండల పరిధిలోని పలు గ్రామాల మీదుగా తిరుగుతూ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తెలియజేస్తూ బంద్‌కు సహకరించాలని సీపీఎం నాయకులు కోరారు. సీపీఎం నాయకులు ఎండి.సలీం, తారాసింగ్, రామకృష్ణ, విజయ్, నరసింహ, రాజేష్, శ్రీనివాస్, కుర్మయ్య, రాజు, సత్తిరెడ్డి, సాయిరాం పాల్గొన్నారు.

జిల్లా రవాణాధికారిగా నవీన్



కందనూలు, ఫిబ్రవరి 15 : నాగర్‌కర్నూల్ జిల్లా రవాణా శాఖ అధికారిగా నవీన్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన గురువారం ఆర్టీఏ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. నారాయణపేట జిల్లా నుంచి ఆయన నాగర్‌కర్నూల్ జిల్లాకు బదిలీపై వచ్చారు. ప్రస్తుతం నాగర్‌కర్నూల్ జిల్లా డీటీవోగా పని చేస్తున్న ఎర్రిస్వామి సికింద్రాబాద్ డివిజన్ పరిధి రవాణా శాఖ అధికారిగా బదిలీపై వెళ్లారు. బదిలీపై వెళ్తున్న డీటీవో ఎర్రిస్వామిని కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు.

మహిళ అదృశ్యం

ఉప్పునుంతల, ఫిబ్రవరి 15: మహిళ అదృశ్యమైన దానిపై కేసు నమోదు అయిన సంఘటన గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండల పరిధిలోని గువ్వలోనిపల్లి గ్రామంలో చోటుచేసుకొంది. ఎస్సై లెనిన్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గంట తిర్పతయ్య భార్య గంట కవిత గురువారం అదే గ్రామంలో కూరగాయాలకు బయటి వెళ్లి తిరిగి రాలేదన్నారు. రాత్రి గ్రామంలో చుట్టుపక్కల గ్రామాల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడానికి కారణం అదే గ్రామానికి చెందిన సామాన్ల దశరథం అయి ఉంటాడని అనుమానం వ్యక్తం చేశారు. భర్త తిర్పతయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన్నట్లు ఎస్సై తెలిపారు.

తుమ్మలపల్లిలో రెండు ఇళ్లలో చోరీ

వంగూరు, ఫిబ్రవరి 15: మండలంలోని తుమ్మలపల్లిలో బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు రెండు ఇళ్లలో చోరీకి పాల్పడినట్లు ఎస్ఐ మహేందర్ తెలిపారు. కళమ్మ ఇంటికి తాళం వేసి ఉండటంతో దుండగులు తాళం విరగొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. బీరువా తాళం పగుల గొట్టి అందులో ఉన్న 22 తులాల వెండి దొచుకెళ్లారు. రామకృష్ణ ఇంట్లో దుండగులు చొరబడి పావులెత్తు బంగారం దొంగిలించారు. బాధితులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ మహేందర్ ఆధ్వర్యంలో క్లూస్‌టీంతో చోరీకి గురైన ఇళ్లను పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కోర్టు ఉత్తర్వులతో ఏడుగురిపై కేసు నమోదు

ఉప్పునుంతల, ఫిబ్రవరి 15: తన వ్యవసాయ భూమిలో ఏర్పాటు చేసుకున్న కంచెను కొందరు ధ్వంసం చేస్తుండగా అడ్డుకోబోయిన తనపై దాడి చేశారని భూ యజమాని గత ఏడాది కోర్టును సంప్రదించగా, గురువారం వారిపై చర్యలు తీసుకోవాలని కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల గ్రామానికి చెందిన అంజమ్మకు చెందిన వ్యవసాయ భూమిలో చుట్టూ ఉన్న కంచెను గత సంవత్సరం అక్టోబరు 3న అర్ధరాత్రి అదే గ్రామానికి చెందిన చిన్న బచ్చన్న, పెద్ద బచ్చన్న, టీచర్ మల్లారెడ్డి, శేఖర్, అంజమ్మ, అలివేల, మహేష్ ధ్వంసం చేశారు. దీనిని యజమాని అంజమ్మ అడ్డుకోగా దాడి చేశారు. ఈ విషయంపై స్థానిక పోలీసు స్టేషన్‌కు వెళ్లగా పోలీసులు పట్టించుకోవడంలేదని కోర్టుకు వెళ్లారు. గురువారం కోర్టు ఉత్తర్వుల మేరకు ఏడుగురిపై కేసు నమోదు చేసిన్నట్లు ఎస్సై లెనిన్ తెలిపారు.

గురుకుల విద్యార్థుల ప్రతిభ

బిజినేపల్లి, ఫిబ్రవరి 14 : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు అనిల్, రామకృష్ణలు జాతీయ స్థాయిలో నిర్వహించిన జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ చూపినట్లు గురువారం ప్రిన్సిపాల్ సుమతి తెలిపారు. నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో చదువుకుంటూ కార్పోరేట్ విద్యాసంస్థలకు దీటుగా జాతీయ స్థాయి పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను, అధ్యాపక బృందాన్ని ఆమె అభినందించారు.

గుండెపోటుతో డాక్టర్ మృతి

కల్వకుర్తి, ఫిబ్రవరి 15 : గుండెపోటుతో ఓ డాక్టర్ మృతి చెందిన సంఘటన గురువారం వెలుగు చూసింది. ఇందుకు సంబంధించిన వివరాలు స్థానికుల కథనం ప్రకారం... కల్వకుర్తి పట్టణంలోని మెడికల్ ల్యాబ్ ఏర్పాటు చేసి మూడేళ్లుగా రేడియాలజిస్టుగా డాక్టర్ చింతల భరత్‌రెడ్డి(36), అతని భార్య కాయితీ చేతనరెడ్డి చర్మ వ్యాధుల. నిపుణురాలుగా ప్రాక్టీస్ చేస్తున్నారు. బుధవారం సాయంత్రం షామీర్‌పేటలోని రిసార్ట్‌లో జరిగిన ఫంక్షన్‌లో పాల్గొన్న డాక్టర్ భరత్‌రెడ్డి ఇంటికి వెళ్లలేదని సమాచారం. గురువారం ఇద్దరు పేషెంట్స్ స్కానింగ్ కోసం వస్తే ల్యాబ్‌స్టాఫ్ భార్య కాల్ చేసినా రెస్పాండ్ కాలేదని తెలిసింది. గురువారం సాయంత్రం 4గంటల సమయంలో రిసార్ట్ సిబ్బంది మృతుడి భార్య డాక్టర్ చేతనరెడ్డికి కాల్ చేసి మృతి చెందిన సమాచారం తెలిపారు. వీరికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

'తాగునీటి సమస్య తలెత్తకుండా చూసుకోవాలి'

ఉప్పునుంతల, ఫిబ్రవరి 15: వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా పంచాయతీ కార్యదర్శులు చూసుకోవాలని ఎంపీడీవో, గ్రామ ప్రత్యేక అధికారి లక్ష్మణ్‌రావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన ఉప్పునుంతలతో గ్రామపంచాయతీ కార్యాలయం ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. నాయకులు అనం తారెడ్డి, శేఖర్‌గౌడ్ ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

వంగూరు, ఫిబ్రవరి 15: విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన మండలంలోని ఉల్పర గ్రామానికి చెందిన సయ్యద్ ఇమ్రాన్ హమ్మద్ కుటుంబసభ్యులను అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు గురువారం గ్రామానికి వెళ్లి పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఇమ్రాన్ హమ్మద్ మృతి బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.40వేలు విరాళం

పెద్దకొత్తపల్లి, ఫిబ్రవరి 15 : మండల కేంద్రమైన పెద్దకొత్తపల్లిలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయానికి సీసీ కెమెరాల ఏర్పాటు కోసం ఆ గ్రామ మాజీ సర్పంచ్ ఆదెర్ల వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ దండు నరసింహలు విరాళాలు అందజేశారు. ఆలయంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు 40వేల రూపాయల నగదును వారు విరాళంగా అందజేశారు. విరాళం అందజేసిన మాజీ సర్పంచ్ ఆదెర్ల వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ దండు నరసింహలుకు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

బల్మూరు, ఫిబ్రవరి 15: మండల కేంద్రంలో గత సంతవ్సరం రైతు ముల్గర తిరుపతయ్య పొలంలో వ్యవసాయ పని చేస్తుంటే విద్యుత్ కరెంటు షాక్‌తో మృతి చెందాడు. కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం చేసినందుకు ఇన్సూరెన్స్‌ను గురువారం అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ 2లక్షల చెక్కును భార్య లక్ష్మమ్మకు అందజేశారు. బల్మూరు మండల పార్టీ అధ్యక్షుడు మల్‌రెడ్డి వెంకట్‌రెడ్డి, జిల్లా నాయకులు కాశన్నయాదవ్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఖదీర్, బల్మూరు మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి సంపంగి రమేష్, కిరణ్, లక్ష్మయ్యగౌడ్, మండల పార్టీ నాయకులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

పెంట్లవెల్లి, ఫిబ్రవరి 15 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో గురువారం విద్యార్థులకు వైద్యాధికారి వినోద్‌కుమార్ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు హిమోగ్లోబిన్ శాతంతోపాటు వివిధ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధ్యాహ్న భోజనంలో గుడ్డుతోపాటు ఉడికించిన ఆకు కూరలు తీసుకోవాలని వారు పేర్కొన్నారు. భోజనం చేసేటప్పుడు చేతులు శుభ్రంగా కడుక్కోవాలని వారన్నారు. ఉపాధ్యాయులు శ్రీధర్, సీవీ.రావు, నరసింహ పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

కొల్లాపూర్, ఫిబ్రవరి 15 : అబ్దుల్ కలాం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ముదిరాజ్ ముదిరాసి జిల్లా నాయకులు సింగోటం రామన్న అకాల మరణం యువతరానికి తీరని లోటు మిగిల్చిందని కొల్లాపూర్ పట్టణ శివగంగా అసోసియేషన్ కార్యకర్తలు పేర్కొన్నారు. సింగోటం రామన్న దశదినకర్మ సందర్భంగా కొల్లాపూర్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో పేదలకు శివగంగా అసోసియేషన్ సభ్యులు అన్నదానం నిర్వహించారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో యువకులకు ఎల్లప్పుడు అండగా నిలిచిన రామన్న మరణం జీర్ణించుకోలేదని పేర్కొన్నారు.